నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఏమైంది ?



చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రి

నూజివీడు టౌన్, ఆగస్టు 28 : నూజివీడు ట్రిపుల్ ఐటీలో అసలు ఏం జరుగుతోంది. రోజుకో వివాదంతో విద్యా సంస్థ ప్రతిష్ఠ మసకబారుతోంది. యాజమాన్యం తమ విధులు నిర్వర్తించడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి కారణంగా విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరికలు జారీ చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. తాజాగా క్యాంపస్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు విష జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధితులుగా మారారు. మూడు రోజులుగా రోజుకు 200 మంది చొప్పున 600 మంది అవుట్ పేషెంట్స్‌గా చికిత్స పొందుతున్నారు. 15 మంది ఇన్ పేషెంట్స్‌గా ఉన్నారు. ఇంత జరుగుతున్నా ఇక్కడి అధికారుల నిర్లక్ష్య వైఖరి మాత్రం మారడం లేదు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ మధ్యలో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అంతర్భాగంగా నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 300 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇంటిబాట పట్టారు. దీనిని గుర్తించి ఇక్కడ తగు జాగ్రత్తలు తీసుకోవడంలో యాజమాన్యం విఫలమైంది. క్యాంపస్‌లో జ్వర బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. మెస్‌ల్లో కొన్నిచోట్ల పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆహారం కలుషితమై పలువురు విద్యార్థులు కడుపు నొప్పి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉడికీ ఉడకని పప్పు, నీళ్ల చారు, బంగాళా దుంప కూర ఇదే తమకు ఆహారంగా పెడుతున్నారని, మెస్‌లలో పారిశుధ్య నిర్వహణ ఘోరంగా ఉంటున్నదని విద్యార్థులు వాపోయారు. మూడు రోజుల క్రితం మెస్‌లతో ఇడ్లీ తిన్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారంటూ చెబుతున్నారు.

ఈ దుస్థితికి కారణాలేంటి ?

విద్యార్థుల దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఉన్నత ఉద్యోగులు దాదాపు 99 శాతం కాంట్రాక్టు విధానంలో వచ్చిన వారే. చివరికి చాన్స్‌లర్, వైస్ చాన్స్‌లర్, డైరెక్టర్లు రెగ్యులర్ కాదు. గవర్నింగ్ కౌన్సిల్‌లోను వివిధ శాఖల అధికారులు వున్నా ఆర్జీయుకేటీ నిర్వహణలో వారి నిర్ణయాలు మొక్కుబడిగా ఉంటున్నాయి. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చాన్స్‌లర్, వైస్ చాన్స్‌లర్, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఇప్పటి వరకు వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించలేదు. దీంతో తమ బాధ్యతల నిర్వహణపై వీరు శ్రద్ధ కనబర్చడం లేదు. మరోవైపు ఈ అధికారులందరూ వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన వారే. నేటికి గత ప్రభుత్వం సానుభూతిపరులుగానే ఉండటంతో ప్రస్తుత ప్రభుత్వానికి వీరు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డైరెక్టర్ క్యాంపస్‌లో ఉండేది తక్కువ.. బయట విధులపై వెళ్లేది ఎక్కువని ఇక్కడి ఉద్యోగులే చెబుతున్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు భోజన సదుపాయాలు అందించే మెస్‌లు టెండర్ల సమయంలో విద్యార్థికి రూ.87 కోట్ చేశారు. ఈ మొత్తానికి బ్రేక్‌ఫాస్ట్, భోజనం కల్పించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. నాసి రకం ఆహారం సరఫరా చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. క్యాంపస్‌లో నిర్వహిస్తున్న దుకాణాల్లో విద్యార్థులకు బయట నుంచి అనేక రకాల ఆహారపదార్థాలు, మద్యం వంటివి అందుతున్నట్లు సుదీర్ఘకాలంగా ప్రచారం జరుగుతున్నా వీటిని అరికట్టడంలో క్యాంపస్ అధికారులు దృష్టి పెట్టలేదు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మంత్రి లోకేశ్ ఆరా

నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల పరిస్థితిపై మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించారు. అనారోగ్య పరిస్థితులు ఏర్పడటానికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్య వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. దీంతో ఏలూరు డీఎంహెచ్‌వో షర్మిష్ట క్యాంపస్‌ను పరిశీలించారు. ఓపీ, ఇన్ పేషెంట్స్‌గా ఎంత మంది వైద్య సాయం పొందారు. వారి పరిస్థితి ఎలా ఉంది అనే అంశాలపై వైద్యాధికారిణి అంజలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యం పాలవడానికి పారిశుధ్య లేమి ఒక కారణమన్నారు. నాణ్యతా ప్రమాణాలతో భోజనాన్ని అందించాలని, ప్రధానంగా పాల ఉత్పత్తులు ఎంత పౌష్టికమో అంత త్వరగా కలుషితం అవుతాయన్నారు. మెస్‌లతో హైజనిక్‌గా భోజనం సదుపాయాలు అందించాలని ట్రిపుల్ ఐటీ ఏవో లక్ష్మణరావుకు సూచించారు.

- రోజుకో వివాదం.. యాజమాన్యంలో అదే నిర్లక్ష్యం
- మూడు రోజులుగా వందల మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు.. ఆసుపత్రిలో చికిత్స
- పారిశుధ్య లోపం.. కలుషిత ఆహారమే కారణం
- ఉడికీ ఉడకని ఆహారం, పాడైన పాల పదార్థాలు
- మంత్రి లోకేశ్ దృష్టి.. విచారణకు ఆదేశం

విద్యార్థి సమస్య వింటున్న మంత్రి పార్థసారథి



అన్న క్యాంటీన్ భోజనమే బెటర్

మంత్రి పార్థసారథి దృష్టికి సమస్యలు ఏకరవు పెట్టిన విద్యార్థులు

నూజివీడు, ఆగస్టు 28 : 'తమ మెస్‌లో భోజనంకన్నా అన్న క్యాంటీన్‌లో భోజనం ఎన్నో రెట్లు రుచికరం, ఆరోగ్యకరం' అని నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రాష్ట్ర మంత్రి పార్థసారథితో చెప్పారు. మూడు రోజులుగా విద్యార్థులు అనారోగ్యం బారిన పడడంతో బుధవారం రాత్రి ఆయన క్యాంపస్‌ను, మెస్‌ను, ఆసుపత్రిని పరిశీలించారు. తమకందిస్తున్న భోజనం ఎంత మాత్రం నాణ్యతగా లేదని, కూరలు వాసన వస్తున్నాయని, వాటిని తిన్న తాము అనారోగ్యం బారిన పడుతున్నామని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మెస్‌లు అధ్వాన్నంగా ఉన్నాయని, క్యాంపస్‌లో లోపించిన పారిశుధ్యంపై అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. పురుగు పట్టిన సరుకులతోనే తమకు వంట చేసి పెడుతున్నారని చెప్పారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ అనారోగ్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సరైన వైద్య చికిత్స అందించే విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై క్యాంపస్ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రిపుల్ ఐటీపై ఇక నుంచి ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

పాటదారుల కుమ్మక్కు!

మాధవాయిపాలెం రేవు పాట రూ.2.98 కోట్లకు ఖరారు


నరసాపురం, ఆగస్టు 28 : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నడుమ అత్యంత కీలకమైన మాధవాయిపాలెం-సఖినేటిపల్లి ఫెర్రీ రేవు పాటలో పాటదారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాటదారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి వారంతా ఒక్కటై హెచ్చు మొత్తంలో పాట వెళ్లకుండా షెడ్యూళ్లు, బహిరంగ వేలంలో పాల్గొన్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రభుత్వాదాయానికి గండి పడిందని చెబుతున్నారు. చివరకు రెండు కోట్ల 98 లక్షల ఎనిమిది రూపాయలకు యలమంచిలి మండలం కనకాయలంకకు చెందిన ది కనకదుర్గ శాండ్ అండ్ క్వారీ కో-ఆపరేటివ్ సొసైటీ పాటను దక్కించుకున్నది. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ సోని అధ్యక్షతన రేవు పాట నిర్వహించారు. పర్యవేక్షణ అధికారిగా డిప్యూటి సీఈవో నిర్మలజ్యోతి హాజరయ్యారు. నలుగురు మాత్రమే ఈఎంఐ కట్టి పాటలో పాల్గొన్నారు. ముందు బహిరంగ వేలం నిర్వహించారు. పాట ప్రారంభ ధర రూ.2.97 కోట్ల నుంచి ప్రారంభించారు. ముందుగా బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో అమరేశ్వర శాండ్ క్వారీ సొసైటీ రూ.2,97,88,717 పాడింది. ఆ తరువాత సీక్రెట్ టెండర్లు తెరిచారు. అందులో నలుగురు పాటదారుల్లో ముగ్గురు మాత్రమే టెండర్లు వేశారు. బహిరంగ వేలం కంటే షెడ్యూల్‌లో వేసిన మొత్తం ఎక్కువగా ఉండటంతో ది కనకదుర్గా సొసైటీకి రేవు పాటను అధికారులు ఖరారు చేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి మార్చి 31 వరకు రేవు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. డీఎల్‌పీవో శ్రీనివాస్, జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎంపీడీవో వీరభద్ర రావు, మల్లికార్జునరావు, ఎంపీటీసీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

2,385 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

ఏలూరుసిటీ, ఆగస్టు 28 : జిల్లాలో మూడు బుకింగ్ సెంటర్ల ద్వారా బుధవారం 135 ఆర్డర్లు నమోదు కాగా 2,385 మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగదారులకు సరఫరా చేసినట్లు మైనింగ్ శాఖ డీడీ రవికుమార్ తెలిపారు. ఇందుకు 114 లారీలు, 21 ట్రాక్టర్లను వినియోగించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 16,768 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేశామన్నారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

చింతలపూడి ఆగస్టు 28 : ఐదుగురు వ్యక్తుల నుంచి 1050 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసినట్లు చింతలపూడి సీఐ రవీంద్ర తెలిపారు. చింతపల్లి శివారు కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం రావడంతో మెడిసెట్టివారిపాలెం సమీపంలో ఎస్ఐ కుటుంబరావు తనిఖీలు చేస్తుండగా తెలంగాణలోని వేంసూరుకు చెందిన షేక్ ఆరిఫ్, గంగారంకు చెందిన షేక్ అబ్దుల్ కరీం, సత్తుపల్లికి చెందిన కాలం అజయ్, షేక్ ఇబ్రహీం, చింతంపల్లికి చెందిన, పసుపులేటి మనోజ్‌లను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. వీరి నుంచి ఒక మోటార్ సైకిల్, ఒక స్కూటర్, నాలుగు వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



అన్నీ ఉన్నా ఆదరణ ఏదీ?

7

- 500 ఎకరాలున్నా ఆదాయం సున్నా
- ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయ దుస్థితి
- ఉత్సవ విగ్రహ చోరీతో భక్తుల విస్మయం

సాగు నీటికి పూర్వ వైభవం



రైతు సమస్యలపై ఇక తక్షణ పరిష్కారాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

చాన్నాళ్ల తరువాత సాగు నీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం జరిగిన రాష్ట్రమంత్రి వర్గంలోను కీలకంగా చర్చించి ఎన్నికలు జరిపేందుకు వీలుగా ఆమోదముద్ర వేశారు. ఈ లెక్కన నిడదవోలు మేజర్ ఇరిగేషన్ డివిజన్ పరిధిలోవున్న మొత్తం 131 సాగు నీటి సంఘాలు ఉండగా, ఒక్క ఏలూరు జిల్లా పరిధిలో 15 సంఘాలకు పైగా ఉన్నాయి. ఏలూరు మైనర్ ఇరిగేషన్ పరిధిలో మొత్తం మీద 185 సాగు నీటి సంఘాలు ఉండగా 13 మండలాల్లో 128 సంఘాలు ఏలూరు జిల్లా పరిధిలోకి వస్తాయి. కే.ఆర్.పురం స్పెషల్ మైనర్ ఇరిగేషన్ డివిజన్ పరిధిలో 37 సాగు నీటి సంఘాలను గుర్తించి ఎన్నికలు నిర్వహించనున్నారు. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో మొత్తం 364కు పైగా సాగు నీటి సంఘాలు ఉన్నాయి. జిల్లాలు విడిపోయిన తర్వాత ఆయా జిల్లాల ప్రాతిపదికనే సాగు నీటి సంఘాలను, ప్రాజెక్టు కమిటీలను గుర్తించి ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇరిగేషన్ డివిజన్ అధికారులు ఏ తేదీల్లో ఎన్నికలు ఎలా నిర్వహించాలో స్పష్టత ఇవ్వబోతున్నారు.

వైసీపీ హయాంలో డీలా..

వ్యవసాయ రంగంలో అత్యంత కీలకమైన సాగు నీటి సంఘాలను టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పెద్దఎత్తున నిర్వహించింది. రైతులు ఎన్నుకునే ఈ సంఘాలు ప్రతినిధుల ద్వారా నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా అమలయ్యేలా జాగ్రత్తలు పడింది. రైతులు ఉమ్మడిగా ఏ సమస్య వచ్చినా ఈ సంఘాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునేవారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యుయూఏ) పేరిట గోదావరి డెల్టాలో కాలువలకు ఏటా మరమ్మతులు నిర్వహించేవారు. ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుని కీలక బాధ్యతలను నిర్వర్తించేవారు. ఇప్పటి వరకు వున్న స్థితిగతులను బేరీజు వేసుకుని రైతులకు ప్రయోజనార్థకంగా ఉండే చర్యలు తీసుకునేవారు. ఈ తరహా పనులన్నింటికీ స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారుల చేయూత లభించేది. గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ విభాగానికి చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత నరసాపురానికి చెందిన

- నీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు
- త్వరలో తేదీలు ప్రకటించనున్న అధికారులు
- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- వైసీపీ హయాంలో కాల్వల నిర్వహణ డీలా
- ఆ రోజుల్లో పట్టించుకునే వారే కరువు..
- టీడీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన సంఘాలు
- కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో రైతుల పాత్రే కీలకం

పాతూరి రామరాజు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన హయాంలో డెల్టా ఆధునీకీకరణతోపాటు కాలువల నిర్వహణ పనుల్లో చురుకుదనం కనిపించేది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు అదృశ్యమయ్యాయి. అసలు ఇరిగేషన్ వ్యవహారాల్లో వీరి పాత్ర లేకుండా చేశారు. కాలువల నిర్వహణకు లస్కర్లు లేకపోయినా కాలువ లాకుల మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం రైతుల పక్షాన ఈ కమిటీలే ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నిధులు రప్పించేవి. రెండో పంట సమయంలో నీటి సరఫరా నిర్వహణలోను కీలకంగా వ్యవహరించేవి. అలాంటిది రైతులకు అత్యవసరమైన ఈ తరహా సంఘాలన్నింటినీ గడిచిన వైసీపీ ప్రభుత్వం గాలిలో వదిలేసింది. సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పట్టుపట్టినా ఆ వైపు తొంగి చూడలేదు. రెండో పంట సమయంలో గతంలో ఈ సంఘాలే జోక్యం చేసుకుని నీటి కొరత ఎదురుకాకుండా వంతుల వారీ విధానంలో రైతుల మధ్య సమన్వయం కుదిర్చేవి. తద్వారా ఎక్కడా వివాదాలు, ఘర్షణలు లేకుండా కీలక పాత్ర వహించేవి

సాగు నీటి సంఘాలు ఎక్కడెక్కడంటే

ఏలూరు జిల్లా పరిధిలోని పోలవరం, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, ఏలూరు నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలను ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే గుర్తించారు. మేజర్ ఇరిగేషన్ పరిధిలోని 15 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉంగుటూరు మండలంలో ఐదు, భీమడోలులో ఆరు, దెందులూరులో మూడు, ఏలూరులో ఒక నీటి సంఘం మేజర్ ఇరిగేషన్ డివిజన్ పరిధిలోకి వస్తాయి. మొత్తం సాగు నీటి సంఘాలను మేజర్, మీడియం, మైనర్ డివిజన్లుగా విభజించి వీటి పరిధిలోకి ఆయా నీటి సంఘాలను తెచ్చారు. ఆ మేరకే సాగునీటి సంఘాలకు ఎక్కడికక్కడ ఎన్నికలు జరుగుతాయి. మైనర్ ఇరిగేషన్ డివిజన్ పరిధిలోకి వచ్చే సరికి ఏలూరు మండలంలో నాలుగు, దెందులూరులో 22, పెదవేగిలో 16, పెదపాడులో ఎనిమిది, లింగపాలెంలో 18, చింతలపూడిలో 17, కామవరపుకోటలో ఏడు, జంగారెడ్డిగూడెంలో 14, ద్వారకా తిరుమలలో 13, ఉంగుటూరులో ఎనిమిది, భీమడోలులో ఐదు, కొయ్యలగూడెంలో తొమ్మిది, టి.నరసాపురంలో నాలుగుతో కలిపి ఏలూరు జిల్లాలో 145 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. కోట రామచంద్రాపురం స్పెషల్ మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పోలవరం మండలంలో తొమ్మిది, బుట్టాయిగూడెంలో 22, జీలుగుమిల్లిలో ఆరు సంఘాలతో కలిపి మొత్తంగా 37 సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. సాగునీటి సంఘాలతోపాటు ఏలూరు జిల్లాలో తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీకి, ఎర్ర కాలువ ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ రెండు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి.

రైతుల హర్షం

సాగు నీటి సంఘాలకు ఎన్నికల నిర్ణయంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. చాలా కాలంగా ఎన్నికలు లేకుండా గాలికి వదిలేయడం, కాలువల నిర్వహణ పట్టించుకోని కారణంగా తాము ఎంత నష్టపోయామో చెప్పనలవి కాని పరిస్థితులు ఉన్నాయని, వీటిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం చొరవ చూపడం అందరికీ సమ్మతమేనని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు లేక ఇప్పటికే కాలువలు చాలాచోట్ల పూడిపోయాయి. మరికొన్నిచోట్ల లాకుల షెట్టర్లు దెబ్బతిన్నాయి. వీటి నిర్వహణకు వీలుగా నయా పైసా చెల్లించకపోవడం, తద్వారా రైతులకు సరైన సమయంలో సాగు నీరందని పరిస్థితి ఐదేళ్లుగా చవిచూశామ న్నది రైతులు చెబుతున్నారు. పార్టీలకతీతంగా ఆయా సంఘాలకు ఎన్నికలు జరగనుండగా వీటిలో అత్యధిక భాగం ఏకగ్రీవమయ్యేలా ఎమ్మెల్యేలకు బాధ్యత అప్పగించబోతున్నారు.

ఇదో అసంబద్ధ 'ప్రశ్నావళి'

నేటి నుంచి ఇంటర్ యూనిట్ పరీక్షలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 28: ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం నుంచి రెండో యూనిట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ప్రశ్నపత్రాలను ఇంటర్మీడియట్ కమిషనరేట్ నుంచి ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ప్రారంభానికి గంట ముందు సంబంధిత జూనియర్ కళాశాలలకు పంపించనున్నారు. వాటిని స్థానికంగా ఫొటోస్టాట్ కాపీలు తీసుకుని పరీక్షలు నిర్వహించే విషయంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విద్యలో ప్రవేశపెట్టిన సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్(సాంప్) తరహాలో ఇంటర్ యూనిట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఈ దఫా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రశ్న పత్రాన్ని కేవలం ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకే పరిమితం చేయడం, వాటిని ఫొటో స్టాట్ కాపీలు తీయించుకుని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించే బాధ్యతలను ప్రిన్సిపాల్స్‌కు అప్పగించడం.. మిగతా యాజమాన్యాల్లోని కళాశాలలను విస్మరించడమేనన్న విమర్శలు వస్తున్నాయి. సంబంధిత కళాశాలల విద్యార్థులకు యూనిట్ పరీక్షలు అవసరం ఉండదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 145 జూనియర్ కళాశాలలు ఉండగా, వీటిలో 35,930 మంది బాల బాలికలు ఆయా గ్రూపుల్లో చదువుతున్నారు. గురువారం నుంచి ప్రారంభమవుతున్న రెండో యూనిట్ పరీక్షలకు జిల్లాలో కేవలం 19 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ కళాశాలల విద్యార్థుల వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో ప్రశ్న పత్రాలను కమిషనరేట్ పంపుతుంది. ఆ ప్రకారం జిల్లాలో కేవలం 21 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతున్న మొత్తం 4908 మంది విద్యార్థులకు మాత్రమే యూనిట్ పరీక్షల ప్రశ్నపత్రాలను పంపిస్తూ, దానికి కొన్నిరెట్లు అధికంగా వున్న 124 ప్రైవేట్ అన్ ఎయిడెడ్, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, హైస్కూల్ ప్లస్, కే.జీ.బీ.వీ జూనియర్ కళాశాలల్లోని 31,022 మంది విద్యార్థులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేటు విద్యార్థులతో పోటీ పడాలనే..

'యూనిట్ పరీక్షలు గురువారం నుంచి ఈ నెల 31 వరకు ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయి. సెప్టెంబరు 3వ తేదీలోగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను నమోదు చేయాలి. ఇంటర్ కమిషనరేట్ నిర్ణయించిన టైం టేబుల్ ప్రకారమే ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు అన్నింటిలోను యూనిట్ పరీక్షలను నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాలను మాత్రం కమిషనరేట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలకు మాత్రమే పంపిస్తారు. ప్రైవేటు కళాశాలలు మొదలుకుని, మిగతా ప్రభుత్వ యాజమాన్య కళాశాలలైన సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్ కళాశాలల అధ్యాపకులే సొంతంగా ప్రశ్నపత్రాలను తయారు చేసుకుని ఈ పరీక్షలు నిర్వహిస్తాయి. ప్రశ్నపత్రాలను సొంతంగా తయారుచేసుకునే విధానం ప్రైవేటు కళాశాలల్లో ఎప్పటి నుంచో ఉంది. ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో సమానంగా పోటీ పడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు మాత్రమే కమిషనరేట్ నుంచి ప్రశ్నపత్రాలను పంపిస్తున్నారు' అని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ తనిఖీ అధికారి చంద్రశేఖరబాబు వివరణ ఇచ్చారు.

ఇప్పటికే ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలను పాటించకుండా విచ్చలవిడిగా కాలేజీలు నిర్వహిస్తూ, వారికి ఇష్టం వచ్చిన సిలబస్‌ను, పాఠ్య పుస్తకాలను అనుసరిస్తున్నాయని, ఇపుడు యూనిట్ పరీక్షల విషయంలోనూ ప్రభుత్వం వాటిని పట్టించుకోక పోవడం విచారకరమని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.అంబేద్కర్ విమర్శించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులందరికీ ఏకకాలంలో, ఏకరీతిన పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు లక్ష మొక్కలు నాటాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30న నిర్వహించే వన మహోత్సవంలో లక్ష మొక్కలు నాటేందుకు సిద్ధం చేసిన కార్యాచరణను పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. 30న జిల్లాలోని ప్రతి గ్రామంలో 200 మొక్కలు చొప్పున ఒక్క రోజులో లక్ష మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారపుపేట, తడికలపూడి, నామవరం, ఫాతిమాపురం, బుట్టాయిగూడెం, మర్లగూడెం, ఉంగుటూరు, వెంకట్రామన్నగూడెంలలోని ఎనిమిది నర్సరీల నుంచి లక్ష మొక్కలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి స్కూల్ అసిస్టెంట్లకు సర్దుబాటు

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 : డివిజన్ స్థాయి సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి జంగారెడ్డిగూడెం డివిజన్‌కు సంబంధించి కొయ్యలగూడెంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ 28 మందికి నిర్వహిస్తారు. ఇక్కడ సజావుగా జరిగితే శుక్రవారం ఏలూరు డివిజన్‌లో 42 మందికి, నూజివీడు డివిజన్‌లో ఆరుగురికి కౌన్సెలింగ్ ఉంటుంది. డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ నుంచి స్పెషల్ కేటగిరీ కింద మినహాయింపునకు ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు మొత్తం 238 మంది టీచర్లు దరఖాస్తు చేసుకోగా, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 160 మందికి అనుమతించడంతో వారి పేర్లను వర్క్ అడ్జస్ట్‌మెంట్ జాబితా నుంచి తొలగించారు. స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు పూర్తయిన తర్వాత సర్‌ప్లస్ ఎస్జీటీలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ తేదీని విద్యా శాఖ ప్రకటిస్తుంది.

ఇంటర్ పరీక్షల విధుల పారితోషికం చెల్లింపునకు చర్యలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 : ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల విధులకు నియమితులైన 700 మంది అధ్యాపకుల్లో 14 మందికి వివిధ సాంకేతిక కారణాల వల్ల పారితోషకం అందలేదని ఆర్ఐవో చంద్రశేఖరబాబు తెలిపారు. ఈ విషయాన్ని ఇంటర్‌బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని, వీలైనంత త్వరగా వీరందరికీ రెమ్యూనరేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

ఉంగుటూరు తహసీల్దార్ సీఆర్డీఏకు బదిలీ

ఉంగుటూరు, ఆగస్టు 28 : ఉంగుటూరు తహసీల్దారు పొట్టూరి సతీష్ అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయన రిలీవ్ అయ్యి.. అక్కడ తహశీల్దార్‌గా చేరతారు.




దేవస్థానం ఉట్టి కొడుతున్న యువకులు

రాజాధిరాజ వాహనంపై తిరువీధులకు పయనమైన శ్రీవారు, అమ్మవార్లు

శ్రీవారి సన్నిధిలో ఉట్ల సందడి

ద్వారకాతిరుమల, ఆగస్టు 28: రాజాధిరాజ వాహనంపై కొలువైన శ్రీవారు, అమ్మవార్ల ముందు యువకులు ఆనందోత్సాహాలతో ఉట్లను కొట్టి భక్తి భావాలను చాటుకున్నారు. శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని బుధవారం సాయంత్రం తిరువీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్ల వాహనం ముందు ఉట్టి కొడుతూ సందడి చేశారు. ఆలయ కల్యాణమండపం వద్ద ఉట్టిని కొట్టిన యువకులను ఆలయ అధికారులు సత్కరించారు.

క్షేత్రంలో భారీగా వివాహాలు, ఉపనయనాలు

సీజన్‌లో ఇదే ఆఖరి మహూర్తం..పెళ్లిళ్లకు మరోనెల బ్రేక్



ద్వారకాతిరుమల, ఆగస్టు 28: ఈ శ్రావణ మాసంలో ఆఖరి ముహూర్తం కావడంతో బుధవారం ఉదయం, రాత్రి చినవెంకన్న క్షేత్రంలో ఎన్నో జంటలు మాంగల్యబంధంతో ఒక్కటయ్యాయి. ఉప నయనాలు జరిగాయి. పెళ్లిబృందాలతో శ్రీవారి ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపం, పాత కల్యాణమండప ప్రాంతంలో వందలాది పెళ్లిళ్లు జరిగాయి. మరోనెల రోజుల పాటు శుభకార్యాలకు బ్రేక్ పడనున్నది. వచ్చేనెల 4 నుంచి రానున్న భాద్రపద మాసం శూన్యమాసం. తిరిగి ఆశ్వీయుజం అనగా అక్టోబరు 5 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభమవుతాయని పండితులు చెబుతున్నారు.

పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత కొట్టుకు లేదు

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 28 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొట్టు పవన్‌కల్యాణ్ పై చేసిన వాఖ్యలను ఖండించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం రెండు నెలలు గడిచిందని 60 రోజులుగా ప్రతీ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం పైనే తామందరం పనిచేస్తున్నా మన్నారు. ఇప్పటికే గ్రామాల్లో తాగునీరు, రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టామ న్నారు. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన మీకు 60 రోజులుగా ఆదాయం లేకపోయేసరికి ప్రజా సమస్యలు గుర్తుకువస్తున్నాయా అంటూ ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యులను సైతం వదల కుండా సొమ్ములు వసూలు చేసిన ఘనత మీకే దక్కుతుందన్నారు. కనీసం మీ కార్య కర్తలకు కప్పు టీ కూడా ఇవ్వని మీరు మా కార్యకర్తలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మీరు పార్టీ మారతారన్న భావన మీ కార్యకర్తలలో ఉందని ముందు ఆ విషయం చూసుకోండంటూ విమర్శించారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

పోలవరం, ఆగస్టు 28 : పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 3,83,373 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.370 మీటర్లు, స్పిల్వే దిగువన 19.820 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఈఈ వెంకటరమణ తెలిపారు. ఎల్లండీపేట రిజర్వాయర్ నుంచి 120 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు.

ఆదర్శ దంపతుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 : కులాంతర, మతాంతర వివాహ దంపతులకు 'అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం-2024' ప్రోత్సహించిన తల్లితండ్రులకు గౌరవ సత్కారం చేసేందుకు తెలుగురాష్ట్రాల్లోని ఆదర్శ జంటల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన సూర్యసుద - సూర్యనారాయణ మాస్టర్ ఫౌండేషన్ ప్రతినిధులు స్మృతిసూర్యవంశీ, సూర్యతేజ సుబ్రాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 40 జంటలకు పురస్కారాలు అందజేస్తామని, ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని వివరించారు. ఆసక్తి వున్న కులాంతర, మతాంతర దంపతులు క్లోజప్ హాఫ్‌సైజ్, ఫుల్‌సైజ్ ఫోటో, దంపతుల, ఇరువురి తల్లితండ్రుల పేర్లు, మ్యారేజ్ డేట్, ఫోటోలు, సర్టిఫికెట్ వివరాలతో ఈ నెల 31లోగా వాట్సప్‌నెంబరు 96523 47207కు పంపాలని కోరారు. పురస్కారాలు సెప్టెంబరు 11న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తామన్నారు.

అర్చకులకు వేతనాల పెంపుపై హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 28: అర్చకులకు వేతనాలు పెంచాలని నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ సాధికారిత కమిటీ సభ్యులు సత్యవాడ దుర్గాప్రసాద్ హర్షం ప్రకటించారు. బుధవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలకు రూ.10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇక పైరూ.15 వేలు ఇవ్వడం పట్ల బ్రాహ్మణ్యం సంతోషం వ్యక్తం చేసిందన్నారు. యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతదేహ సమాచారం పోలీసులకు అందజేత

మృతుని గుర్తింపునకు ప్రత్యేక బృందం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి


ఏలూరు క్రైం, ఆగస్టు 28 : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న గుర్తు తెలియని మృత దేహ సమాచారాన్ని ఎట్టకేలకు ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు ఆసుపత్రి సిబ్బంది బుధవారం మధ్యాహ్నానికి అందించారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 20వ తేదీ ఉదయం ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం జంగారెడ్డిగూడెం రోడ్డులో జెఎంజె స్కూలు సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి (35)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని ఏలూరు ప్రభు త్వాసుపత్రిలో చేర్పించగా 22వ తేదీ ఉదయం మరణించాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.ఈ సమాచారం ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇవ్వడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. చివరకు బుధవారం మధ్యాహ్నానికి సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇచ్చారు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులు ఆ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గుర్తించేందుకు, మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేశారు. మృతుడి వివరాలు తెలిస్తే ఏలూరు రూరల్ ఎస్ఐ సెల్‌నంబర్ 94407 96636 కు సమాచారం అందించాలని కోరారు.

అన్నీ ఉన్నా ఆదరణ ఏదీ ?

500 ఎకరాలు ఉన్నా ఆదాయం సున్నా

జమిందారుల ఏలుబడిలో అభివృద్ధికి దూరం

ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయ దుస్థితి



శోభనాచల వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి ఆలయం

నూజివీడు, ఆగస్టు 28: దిక్కులేని వారికి దేవుడే దిక్కు అంటారు. శోభనాచలవ్యాఘ్రలక్ష్మి నరసింహాస్వామి పేరుకు సంపన్నుడే.. కాని అనాథ. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో ఈ క్షేత్రం దక్షిణసింహాచలంగా ప్రసిద్ధి చెందింది. సరైన ప్రచారం లేక నిర్వహణ లోపాలతో అభివృద్ధికి నోచుకోక కునారిల్లుతోంది. ఈ దేవాలయానికి నాడు జమిందారులు 500 ఎకరాలకు పైగా భూమిని నిత్య దూపదీప నైవేద్యాల కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ భూమి రైతులపరం అయింది. ఈ భూమి నుంచి ఒక్కరూపాయి కూడా ఇప్పటికి ఈ దేవాలయానికి ఆదాయంగా రావడం లేదు. స్వామి వెలసిన ఈ కొండ అంతా ఈ దేవాలయానికి చెందినదే. దిగువ ప్రాంతం చుట్టూ కొండను 500 కుటుంబాలు ఆక్రమించి భవనాలు సైతం నిర్మించుకున్నారు. వీటి నుంచి అద్దెరూపేణా ఒక్క పైసా కూడా దేవాలయానికి అందడం లేదు.

నవ నారసింహావతారాల్లో ఒకటి

నాలుగు వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన శివకేశవులు కొలువు తీరిన పుణ్యక్షేత్రం ఇది. నరనవ నారసింహావతారాల్లో ఒక అవతారం వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి అవతారం.ఇక్కడ స్వామికొండపై స్వయంభూగా వెలిశారు. శుభ్రవతుడు అనే చంద్రవంశపు రాజు నరసింహుడు గురించి కొండపై తీవ్ర తపస్సు ఆచరించి స్వామి అనుగ్రహం పొంది ఈ కొండపై అమ్మవారితో కలిసి వెలవాలని కోరిన కోరిక మేరకు స్వామి ఇక్కడ స్వయంభూగా వెలిసినట్లు కథనం. మరో కథనం ప్రకారం శివకేశవులు లోక సంచారం చేస్తూ ప్రకృతి శోభతో విరాజిల్లుతున్న ఈ ప్రాంతానికి వచ్చినపుడు ముగ్ధులై ఇక్కడ కొండ అగ్రభాగాన శివుడు, కొండ మధ్య భాగాన లక్ష్మీనరసింహ అవతారంతో విష్ణువు వెలసినట్లు ప్రచారం. కాలానుగుణంగా ఈ దేవాలయం నూజివీడు జమిందారులైన మేకా వంశస్తులు వంశ పారంపర్య ధర్మకర్తలుగా ఉన్నారు. ఈ క్షేత్రం అగ్రభాగానికి వెళ్లేందుకు 750 మెట్లు ఎక్కాలి. 150వ మెట్టు వద్ద శేషయ్యపీఠం, కోదండ రామాలయం, 200వ మెట్టు వద్ద వేణుగోపాలస్వామి ఆలయం, 325 మెట్టు వద్ద వెంకటాచలస్వామి ఆలయం, 500 మెట్టు వద్ద శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ ఆలయాలు ఉన్నాయి. అగ్రభాగాన శివుడు, కొండ మల్లేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. శ్రీమహావిష్ణువు ఇక్కడ వరాహరూపంలో వరాహ పుష్కరిణిని సృష్టించారని ప్రతీతి. కొండ దిగువున ఈ పుష్కరిణి ఇప్పటికీ ఉంది.

హామీలు నీటిమూటలే

ఈ దేవాలయానికి వంశపారంపర్య ధర్మకర్త అయిన నూజివీడు మాజీ శాసనసభ్యుడు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా నూజివీడు నుంచి గెలిచారు. ప్రతి ఏటా జరిగే రథోత్సవంలో ఆయన ఈ గుడి అభివృద్ధికి హామీలు ఇచ్చేవారు. కాని అవేమీ కార్యరూపం దాల్చలేదు. ఆగిరిపల్లి కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేయిస్తానని అనేక పర్యాయాలు ధర్మకర్తగా, శాసనసభ్యుడిగా పలుమార్లు హామీలు ఇచ్చినా అవి అమలు కాలేదు. నూజివీడు మాజీ శాసనసభ్యుడు చిన్నం రామకోటయ్య ఘాట్ రోడ్డు నిర్మాణం చేయటానికి ప్రయత్నాలు చేయగా ఆలయ ధర్మకర్తలు మేమే అభివృద్ధి చేసుకుంటామని చెప్పడంతో ఆగిపోయింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పథకం రూపొందించింది. ఈ క్షేత్రానికి దగ్గరలో వెయ్యి ఎకరాలు విస్తీర్ణంలో బ్రహ్మలింగయ్య చెరువు ఉంది. ఈ చెరువు ఇటు నూజివీడు, అటు గన్నవరం నియోజకవర్గాలను కలుపుతూ ఉంటుంది. ఈ చెరువులో బోటింగ్, పర్యాటక కేంద్రంగా రూపొందించటానికి నాడు అంచనాలు రూపొందించారు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్షేత్రానికి ఘాట్‌రోడ్డు వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభిస్తే దాతలు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. 750 మెట్లు ఎక్కడానికి కష్టమైన భక్తుల కోసం కొండ దిగువున శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహాస్వామి ప్రతిష్ఠ ఆలయాన్ని నిర్మించారు.

భక్తుల విశ్వాసానికి విఘాతం

ఉత్సవ విగ్రహ చోరీతో భక్తుల విస్మయం




ఆగిరిపల్లి, ఆగస్టు 28: చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహ చోరీ భక్తుల విశ్వాసానికి విఘాతం కలిగించినట్లు అయింది. స్వయంభువుగా వెలసిన ఎగువ సన్నిధి స్వామి వద్ద నైవేద్యం పెట్టి ఘంట కొడితేనే దిగువ సన్నిధిలోని స్వామివారికి నైవేద్యం పెడతారు. ఈ రెండు నివేదనల మధ్యకాలంలో చోరీ జరగటం, అది పట్టపగలు జరగటం భద్రతా లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఈ ఆలయ పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని దేవస్థానం కార్యదర్శి పోలీస్‌శాఖకు పలుమార్లు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాల వైర్లు, విద్యుత్ వైర్లుపూర్తిగా కత్తిరించి ఈ దొంగతనం చేసినట్లుగా తెలిసింది. పోలీసులను వివరణ అడగ్గా బుధవారం సాయంత్రం క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలు సేకరించిందని వివరాల్లో తెలియాల్సి ఉంద న్నారు. ఈ చోరీపై రెండుటీమ్‌లు విచారణ చేస్తున్నాయని ఏఎస్సై తవేరియా నాయక్ తెలిపారు.

క్షమించరానిది : మాదల శివరామ్‌ప్రసాద్,గ్రామస్థుడు



ఎండోమెంట్ నిర్వహణలో ఉన్న ఆలయంలో ఉత్సవ విగ్రహం చోరీ. క్షమించరాని విషయం. గంజాయికి అలవాటు పడిన ఆకతాయిలు ఇలాంటి నేరాలు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిపెట్టాలి: కృష్ణకుమార్,గ్రామస్థుడు



దేవాలయాల భద్రతపట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలి గత ప్రభుత్వం దేవాలయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దేవాలయాల పరిరక్షణపై చర్యలు చేపట్టాలి.



అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

రుచికరమైన ఆహారం అందించాలి : జేసీ

తణుకు, ఆగస్టు 28 :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ల ద్వారా శుచికరమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తణుకు అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వారితో మాట్లాడుతూ పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రోజు మొత్తంలో 15 రూపాయలు ఖర్చు చేస్తే తినడానికి సరిపోతుందని, మా డబ్బులు ఆదా అవుతున్నాయని వివరించారు. క్యాంటీన్ లోపల, బయట పరిసరాలు ఎపుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాత్రలు శుభ్రంగా క్లీన్ చేయాలని లేనిపక్షంలో ఆహారం కలుషితం అయ్యి అనారోగ్యాలకు దారితీస్తుందన్నారు. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, మున్సిపల్ ఇంజనీర్ కొవ్వూరి ఈశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఫిట్‌నెస్ కోసం సమయం కేటాయించాలి : కలెక్టర్

ఏలూరు రూరల్, ఆగస్టు 28:ప్రజలు తమ రోజువారి జీవితంలో శారీరక వ్యాయామం, క్రీడలను అభ్యాసం చేసి ఆరోగ్యంగా, ధృడంగా ఉండాలని, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు పురస్కరించుకుని వారం రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడోత్సవాల్లో భాగంగా బుధవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవన శైలి, ఫిట్‌నెస్, ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 30 నిమిషాలు కేటాయిస్తానని కుటుంబ సభ్యులు, స్నేహితులు ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేలా ప్రోత్సహిస్తానని క్రీడాకారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్టేడియంలో పలు పోటీల్లో కలెక్టర్‌తో పాటు జేసీ దాత్రిరెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్డీవో ఎస్.ఎస్.కె ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, డీపీవో టి.శ్రీనివాస్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తల్లి మందలించిందని కాల్వలోకి దూకేశాడు



పాలకోడేరు, ఆగస్టు 28: తల్లి మందలించిందని ఇంటి నుంచి చెప్పకుండా వెళ్ళిపోయిన పాలిటెక్నిక్ విద్యార్థి బుధవారం గొల్లవానితిప్పవద్ద యనమ దుర్రు డ్రైన్‌లో శవమై తేలాడు. గొరగనమూడి గ్రామంలోని పెదపేటకు చెందిన తులసి అవినాష్ (17) భీమవరంలోని ఒక కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఈనెల 26వ తేదీన తల్లి మందలించిందని అవినాష్ ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కుటుంబసభ్యులు బంధువుల వద్ద స్నేహితుల ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పాలకోడేరు పోలీసులకు అవినాష్ తండ్రి సతీష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈలోగానే బుధవారం గొల్లవానితిప్ప వద్ద యనమదుర్రు డ్రైన్‌లో మృతదేహం ఉందని తెలియడంతో అవినాష్ కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా శవమై తేలి ఉన్నాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి



కామవరపుకోట, ఆగస్టు 28 : కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పెంటపాటి ప్రసన్నలక్ష్మి (40) బుధవారం కొత్తూరు చెక్‌పోస్టు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ప్రసన్న లక్ష్మి భర్త రవికుమార్ కొండగూడెంలోని ప్రాథ మిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వీరు మారుతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరారు. కొత్తూరు చెక్‌పోస్టు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి ఒక ట్రాక్టర్ స్పీడుగా వచ్చి ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ప్రసన్నలక్ష్మి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 28 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బూసి రామ్ ప్రసాద్ (23) ఈనెల 27వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో మినీ బైపాస్‌పై మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గ్రీన్‌సిటీ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒక ప్రవేటు ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి దగ్గర పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

ఏటీఎంలో అర్ధరాత్రి బాంబ్ స్క్వాడ్ తనిఖీ



ఏలూరు క్రైం, ఆగస్టు 28 : ఏలూరు పవర్‌పేటలోని ఒక ఏటీఎంలో సూట్‌కేస్ ఉండడంతో ఏటీఎంలో సొమ్ములు డ్రా చేయడానికి వెళ్ళి వారంతా హడలిపోయారు. ఆ సూట్ కేసులో ఏ ముందే తెలియక రకరాలుగా చెప్పుకున్నారు. ఈనెల 27వ తేదీ రాత్రి పవర్‌పేటలోని పంజాబ్‌నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో ఒక సూట్ కేసు ఉంది. రాత్రి 9 గంటల నుంచి ఈ సూట్‌కేసు అక్కడే ఉందని చెప్తున్నారు. చివరకు ఏటీఎం సెంటర్ సొమ్ములు డ్రా చేయడానికి వచ్చిన వారు ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని బాంబ్ స్క్వాడ్‌ను రప్పించారు. అర్ధరాత్రి సమయంలో తనిఖీలు నిర్వహించారు. చివరకు అలాంటిదేమీ తేల్చారు. బ్యాంక్ మేనేజర్‌ను పిలిపించడంతో ఆ సూట్‌కేసు తానే మర్చి పోయానంటూ బ్యాంకుకు సంబంధించిదని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మొగల్తూరు, ఆగస్టు 28: మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన యువకుడుపై ఫోక్సో కేసు నమోదైంది. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి 17 సంవత్సరాల బాలికను గర్భవతిని చేయడంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాజేంద్ర తెలిపారు. బాలిక ఇటీవల అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తీసుకెళ్ళగా ఎనిమిదో నెల గర్భిణీగా వైద్యులు ధృవీకరించారు. ఈ విషయాన్ని బాలిక తల్లితండ్రులకు చెప్పడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.


స్థలం కోసం కూతురిపై తండ్రి దాడి

గొడవ ఆపడానికి వచ్చిన మేనమామపై దాడి.. తీవ్ర గాయాలతో మృతి

కూతురు, అల్లుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాణి



వివాద స్థలం



మృతిచెందిన మేనమామ కృష్ణ

భీమడోలు, ఆగస్టు 28 : ఇంటి స్థలం వివా దంలో కన్న కూతురుపై నాన్న, పెద నాన్న దాడిచేసిన సంఘటనలో మధ్యలో గొడవ ఆపేందుకు వచ్చిన బంధువు కత్తి పోట్లకు బలయ్యాడు. కూతురు, అల్లుడు గాయాల పాలయ్యారు. ఏలూరు జిల్లా భీమడోలు శివారు అర్జావారి గూడెంలో జరిగిన ఈ ఘటన ఉలిక్కిపడేలా చేసింది. భీమడోలు మండలం అర్జావారి గూడెంలో ఉండే తడపల వెంకటేశ్వరరావు, దుర్గారావు అన్న దమ్ములు. దుర్గారావు కుమార్తె పూజారాణికి ఆమె అమ్మమ్మ సుమారు 3 సెంట్ల ఇంటి స్థలాన్ని ఇచ్చింది. పూజారాణి తన భర్త మోజేష్‌తో కలిసి అమ్మమ్మ ఇచ్చిన స్థలంలో తాతాల్కికంగా నిర్మించుకున్న షెడ్‌లో కాపురం ఉంటున్నారు. అయితే దుర్గారావు తన అమ్మ ఆస్తి తనకే చెల్లుతుందంటూ కూతురు ఉంటున్న స్థలం వెనక్కు ఇచ్చేయాలని ఆరు నెలలుగా గొడవ చేస్తున్నాడు. ఇటీవల ఈ వివాదంపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తండ్రి దుర్గారావును ఇది తప్పని హెచ్చరించారు. బుధవారం ఉదయం కూతురుపై గొడ్డలితో దాడి చేసేందుకు వెళ్లగా గొడవ ఆపేందుకు ఆమె మేనమామ చాబత్తుల కృష్ణ (50) మధ్యలోకి వెళ్ళగా దుర్గారావు అన్న వెంకటేశ్వరరావు వెనుక నుంచి వచ్చి కోత కత్తితో కృష్ణ మెడపై నరికాడు. అడ్డు వచ్చిన రాణి, భర్త మోజేష్‌లపై కూడా కత్తితో దాడి చేశాడు.ఈ ఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. రాణి ఏలూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అల్లుడు మోజేష్ భుజంపై స్వల్ప గాయాలయ్యాయి. నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. భీమడోలు సీఐ రవి కుమార్‌తో పాటు క్లూస్ టీమ్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భీమడోలు జంక్షన్‌లో ఆందోళన

మృతి చెందిన కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ భీమడోలు జంక్షన్‌లో అర్జావారిగూడెం ప్రజలు, మృతుడి బంధువులు కృష్ణ మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, ఉన్నతాధికారులు వచ్చి హామీ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు తహసీల్దార్ రమాదేవి, సీఐ రవికుమార్ తదితరులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి రక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.




పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు..పులిహోరలో కనిపించిన పురుగు

పులిహోర ప్రసాదంలో పురుగు కలకలం

ద్వారకాతిరుమల, ఆగస్టు 28: చినవెంకన్నను దర్శించుకున్న అనంతరం భక్తులు స్వామివారి ప్రసాదం ఆరగించేందుకు ప్రాధాన్యం ఇస్తారు. అందులో లడ్డూ తరువాత స్థానం పులిహోరదే.. భక్తులు పరమ పవిత్రంగా భావించే ప్రసాదాల్లో పురుగు కన్పించడం కలకలం రేపింది. మంగళవారం రాత్రి క్షేత్రానికి కుటుంబసమేతంగా వచ్చిన ఓ భక్తుడు దర్శనానంతరం ప్రసాదాలను కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి దానిని తినేందుకు ప్రయత్నించి అవాక్కయ్యాడు. పులిహోర ప్రసాదంలో పురుగు కనిపించడమే ఇందుకు కారణం. ఏలూరుకు చెందిన బలభద్ర రామయ్య తన భార్యతో కలసి మంగళవారం సాయంత్రం శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం ప్రసాదాల కౌంటర్‌లో లడ్డూ, పులిహోర, శర్కరపొంగలి కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన తరువాత పులిహోర తినేందుకు ప్యాకెట్ విప్పగా అందులో పురుగు కన్పించడంతో ఆందోళన చెందారు. ఈ విషయాన్ని ఆయన ఏలూరుకు చెందిన తన స్నేహితుడైన టీడీపీ రాష్ట్ర ట్రేడ్ వింగ్ ఉపాధ్యక్షుడు పైడేటి రఘుకు తెలియపర్చగా ఆయన వాట్సప్ ద్వారా ఈవో వేండ్ర త్రినాథరావుకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే బుధవారం ఉదయం ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు.

ప్రసాదాల రవాణాలో పడి ఉండొచ్చు

ఈ ఘటనపై ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ ఏలూరు భక్తులు కొనుగోలు చేసిన ప్రసాదంలో పురుగు వచ్చినట్లు తనకు సమాచారం వచ్చిందని వెంటనే ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశామన్నారు. భక్తులకు విక్రయించే ప్రసాదాలను ట్రక్కు ఆటో ద్వారా కౌంటర్లకు తరలిస్తారని రవాణా చేసే సమయంలోనే చెట్లపై నుంచి ఈ పురుగు పడి ఉండవచ్చని వివరించారు. ముందుగా కాంట్రాక్టరుకు నోటీసు ఇచ్చామని అలాగే ఏఈవో, సూపరింటెండెంట్, ఇతర సిబ్బందిపై చర్యలకు ప్రతిపాదిస్తామన్నారు.



వరదల్లో కొట్టుకుపోతున్న వారిని కాపాడిన అల్లూరి నగరం వాసులను సన్మానించిన ఎస్పీ కిషోర్

ప్రాణదాతలకు జిల్లా ఎస్పీ సత్కారం

భవిష్యత్తులో ఉపయోగించడానికి 50 లైఫ్ జాకెట్లు అందజేత

ఏలూరు క్రైం/ వేలేరుపాడు ఆగస్టు 28 : గత నెలలో భారీ వర్షాలకు కొండవాగులు పొంగటంతో గోదావరిలో నీరు చేరి ప్రమాదస్థాయికి వచ్చింది. ఈ సమయంలో రాజమహేంద్రవరం నుంచి రుద్రమకోట గ్రామానికి కారులో వెళ్తున్న ఒక కుటుంబం మార్గమధ్యలో వేలేరుపాడు మండలం మేడిపల్లి పంచాయతీ అల్లూరి నగరం గ్రామం వద్దకు వచ్చేసరికి కొరిసిల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దాటే ప్రయత్నం చేయగా కారు చిక్కుబడిపోయింది. అల్లూరి నగర్ కోయమాదారం గ్రామ యువకులు ప్రాణాలకు తెగించి కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులను కాపాడారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన అల్లూరి నగర్ యువకులను బుధవారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి రప్పించారు. వీరిని జిల్లా ఎస్పీ కిషోర్ సన్మానించి శాలువాలతో సత్కరించి పది వేల రూపాయల నగదు బహుమతి అందించారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన కొంకిపాటి శివాజీ, చాపర్ల శ్రీనివాసరావు, మిడియం ధర్మయ్య, చిలుకూరి లక్ష్మణరావు, శ్రీను, ఎలుపల ప్రసాద్, కట్టి పాపారావు, సున్నం ప్రసాద్‌లను సన్మానించారు. ఎన్ఆర్‌కె ఫౌండేషన్ ఎండీ నూకల లక్ష్మణరావు, చందులు వీరందరినీ అభినందించి భవిష్యత్తులో ఉపయోగించుకోవాలని 50 లైఫ్ జాకెట్ (50 వేల రూపాయల విలువైన)లను ఎస్పీచేతుల మీదుగా అందించారు. కారు ప్రమాదంలో గడ్డం సాయికుమారి, జ్యోతి, జగదీష్‌కుమార్, కుందన్ కుమార్‌లను రక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, సాయి కుమారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెప్టెంబరు ఒకటిలోగా ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 : శాసనమండలి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నిక నిర్వహణలో భాగంగా అర్హతలు గల టీచర్లందరూ సెప్టెంబరు ఒకటో తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకుని, ఫారం-19ని స్థానిక ఎంపీడీవోకు మూడో తేదీలోగా సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఓ ప్రకటనలో కోరారు. అభ్యంతరాలను అక్టోబరు 30లోగా పరిష్కరించి, తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామని వివరించారు. సందేహాలుంటే డీఈవోను సంప్రదించాలని సూచించారు.

కొండంగిలో యువకుడి అదృశ్యం

కువైట్ పంపుతానని సొమ్ము తీసుకున్న వ్యక్తి నిర్లక్ష్యం

ఒత్తిడికి గురై ఇంట్లోంచి వెళ్లిపోయాడన్న తల్లి

కలిదిండి, ఆగస్టు 28 : మండలంలోని కొండంగి గ్రామానికి చెందిన నున్న మోజేష్ (32) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని తండ్రి ఏసురత్నం ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మోజేష్ అదృశ్యమవ్వటానికి పాలకొల్లుకు చెందిన గల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి కారణమని తల్లి మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కువైట్ పంపిస్తానని మోజేష్‌తో సహా మరో 11 మంది నుంచి మోజేష్ ద్వారా రూ. 9 లక్షలు గల్లి శ్రీనివాసరావు వసూలు చేశాడని, నెలలు గడుస్తున్నా కువైట్‌కు పంపించకపోవటంతో బాధితులకు అనుమానం వచ్చి శ్రీనివాసరావుకి ఫోను చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవటం లేదని తెలిపింది. దీంతో 11 మంది బాధితులు మోజేష్‌ని నిలదీయడంతో ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడని, తన కుమారుడిని మోసం చేసిన గల్లి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని తల్లి మరియమ్మ కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ధాత్రి రెడ్డి, ఎస్పీ కిశోర్

వృద్ధుల సమస్యలను తెలుసుకోవాలి : ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 28: వృద్ధుల సమస్యలను తెలుసుకుని వారికి సహాయ కారిగా ఉండాలని గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఎస్పీ కెసీఎస్ కిశోర్ సూచించారు. సీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో సీనియర్ సిటిజన్‌పై శ్రద్ధ సంరక్షణ కార్యక్రమాన్ని బుధవారం పోలీస్ శాఖ నిర్వహించింది. ఎస్పీ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడారు. గ్రామ, వార్డు సంరక్షణ ఉద్యోగం ఎంతో ప్రాధాన్యత కల్గిందని, క్షేత్రస్థాయిలో గ్రామ మహిళా కార్యదర్శి వృద్ధుల సమస్యలు తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేలో వృద్ధులను వేధించినట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తల్లి దండ్రులను వేధింపులకు గురిచేస్తే సీనియర్ సిటిజన్ యాక్టు మేరకు చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు అంతర్గత ఆడిట్ : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 28: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కార్మిక, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశించారు. పరిశ్రమల్లో భద్రతాచర్యలపై పారిశ్రామిక యాజమాన్యాలు, అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తొలుత పరిశ్రమల్లో అంతర్గత ఆడిట్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం పరిశ్రమలను అధికారులు, నిపుణుల కమిటీలు తనిఖీ చేసి భద్రత ప్రమాణాలు నిర్ధారించాలన్నారు. ప్రతీ పరిశ్రమలో సేఫ్టీ అధికారిని నియమించుకుని, అగ్నిమాపక నివారణ అధికారుల నుంచి శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ ప్రమాదం తలెత్తినపుడు స్పష్టమైన అత్యవసర ప్రణాళిక ఉండాలని ఆదేశించారు. కర్మాగారాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఆదిశేషు, పీసీబీ ఈఈ నజీనాబేగం, జిల్లా ఫైర్ అధికారి రత్నబాబు, వివిధ శాఖల అధికారులు, ఆర్డీవో ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనాలి

ఏలూరు సిటీ: భారతీయ రిజర్వు బ్యాంకు క్విజ్ పోటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం ఆవిష్కరించారు. జిల్లాలో డిగ్రీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి మాట్లాడుతూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లను సెప్టెంబర్ 17లోపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

కొత్త పట్టిసీమలో దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్

పోలవరం, ఆగస్టు 28: కొత్తపట్టిసీమలో దోమల నివారణకు బుధవారం ఫాగింగ్ నిర్వహించారు. సర్పంచ్ మైగాపుల విజయదుర్గ సూచనతో అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నట్లు కార్యదర్శి అత్తిలి సుబ్రహ్మణ్యం తెలిపారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో నీటిని మోటార్లతో తోడించామని, ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ కోసం స్ప్రేయింగ్ చేయించామన్నారు. నీటి గుంటల్లో ధాన్యపు ఊక, రంపపు పొట్టు, మడ్డి డీజిల్ కలిపిన గుడ్డ ఉండలు వేయడం ద్వారా దోమల నివారణ చేయవచ్చని తమ పంచాయతీలో ఆవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 28: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతి తెలిపారు. పడమరవీధి, ఎంఆర్‌డీ బలరామ్‌రోడ్డు, ఇండియన్ గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో బుధవారం పారిశుధ్యం మెరుగుదల పనులు చేపట్టారు. దోమలు ప్రబలకుండా స్ప్రేయింగ్, ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వేశారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూళ్ళలో ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది

భీమడోలు, ఆగస్టు 28 : పూళ్ళ పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో వైద్యులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పూళ్ళ, దుద్దేపూడి, కైకరం, కురేళ్ళగూడెం గ్రామాల్లో జ్వరాల సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేశారు. అనంతరం చికిత్స నిర్వహించి మందులను ఉచితం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య కల్యాణ మహేశ్వరి, అరుణ జ్యోతి, కిషోర్, శ్రీనివాసరావు, మోహన భాయ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని మండల సూపర్‌వైజర్ రామకృష్ణ సూచించారు. భీమడోలు రత్నా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి రాకుండా జాగ్రత్తలు, రోగులు తీసుకోవాల్సిన చికిత్సలు గురించి తెలిపారు. ప్రస్తుతం వస్తున్న జ్వరాలు, వాటి నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, అశోక్, బాలు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

- పెదపాడు: హెచ్ఐవీ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ ఎం.దుర్గాభవాని తెలిపారు. పాతముప్పర్రులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్లస్టర్ లింక్ వర్కర్ వి.పావని తదితరులు పాల్గొన్నారు.

కైకరంలో వైద్య శిబిరం

ఉంగుటూరు: పూళ్ళ పీహెచ్‌సీ పరిధిలో సీజనల్ జ్వరాలు ఉధృతమవుతున్నాయి. బుధవారం వైద్య సిబ్బంది ఈ.కళ్యాణి మహేశ్వరి, అరుణ జ్యోతి ఆధ్వర్యంలో కైకరం-1,2 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఏఎన్ఎంలు ఎంపీహెచ్‌వో కిశోర్, శ్రీనివాసరావు మోహనాబాయి తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసారు. వైద్యులు మాట్లాడుతూ కైకరంలో ఏడు జ్వరం కేసులు వచ్చాయని 198 రోగులను పరీక్షించామన్నారు.

వినాయక చవితి మండపాలకు అనుమతి తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

చింతలపూడి, ఆగస్టు 28: వినాయకచవితి మండపాలకు పోలీసు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. సీఐ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు స్థల యజమాని నుంచి అభ్యంతరం లేదని పత్రం తీసుకోవాలని, విద్యుత్‌శాఖ నుంచి మండపానికి విద్యుత్ సరఫరా ఏ విధంగా తీసుకుంటున్నారో అనుమతిపత్రం జతచేస్తూ దరఖాస్తులు నిర్వాహకులు, వలంటీర్లు పేర్లు నమోదు చేయాలని సూచించారు. మండపం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు మండపం నుంచి ఊరేగింపు మార్గం, నిమజ్జనం వద్ద ఎంత మంది ఉంటారో వివరాలు కూడా నమోదు చేయాలని చెప్పారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ధర్మాజీగూడెం, తడికలపూడి పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వాహకులు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో దరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ప్రగడవరంలో వాసవీ విగ్రహ ప్రతిష్ఠ


పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, ఆగస్టు 28: ప్రగడవరం వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణమండపంలో వాసవీమాత శిలావిగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. పండితుల మంత్రోచ్చరణ నడుమ విగ్రహ ప్రతిష్ఠను నున్న సత్యనారాయణ నిర్వహించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు, నాయకులు, కె.రాజశేఖర్‌రెడ్డి, టి.చంద్రశేఖర్‌రెడ్డి, వీర్రాజు, రామారావు, కేవీఎస్ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


గుడిపాడులో మీ కోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతమనేని

విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వద్దు

గురుకుల పాఠశాల తనిఖీ చేసిన ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం, ఆగస్టు 28: విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరించారు. గురుకుల పాఠశాలను బుధవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నా సకాలంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది స్పందించడం లేదని తల్లిదండ్రులు కలెక్టర్, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. జేసీ, ఐటీడీఏ సీవో పి.ధాత్రిరెడ్డి గురుకులాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులు, తీసుకుంటున్న చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బాలరాజు గురుకులాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందుతున్న వైద్యసేవలు, మెనూ, శానిటేషన్ ఇతర సదుపాయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకు వెంటనే వైద్య పరీక్షలు జరిపి చికిత్స అందేలా చూడాలన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రిన్సిపాల్, ఇతర అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజలే పాలకులు : ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ప్రజలే పాలకులని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నాయుడుగూడెం, గుడిపాడు, వడ్డిగూడెం గ్రామాల్లో జరిగిన మీకోసం - మీ చింతమనేని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామసభల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇస్తామని, అనర్హులు లబ్ధి పొందితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతిపై గ్రామస్తులు పలు ఫిర్యాదులు చేయగా, శాఖాపరంగా విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో వున్న హౌసింగ్ బకాయిలను సంక్రాంతి లోపు వారికి అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తోటగూడెం - పునుకొల్లు బీటీ రహదారి నిర్మాణానికి పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. గత పదేళ్లుగా ఈ రహదారి పూర్తిగా ధ్వంసమై గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ మేరకు నిర్మాణ పనులను ప్రారంభించినట్లుగా ఎమ్మెల్యే ప్రభాకర్ తెలిపారు.


రాష్ట్ర మంత్రులతో సమావేశమైన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

రాష్ట్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్: అమరావతి సచివాలయంలో రాష్ట్రమంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్‌ను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించి పరిష్కారానికి సహకరించాలని మంత్రులను కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని మంత్రులు ఎమ్మెల్యే చంటికి హామీ ఇచ్చారు.

జిల్లాలో గంజాయిని అరికట్టాలి : దాసరి శేషు

జంగారెడ్డిగూడెం: జిల్లాలో గంజాయిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనితను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు కోరారు. వెలగపూడి సచివాలయంలో హోంమంత్రిని దాసరి శేషు కలిశారు. జిల్లాలో ఎంతోమంది యువకులు గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గంజాయి సంస్కృతి గ్రామాల్లోకి కూడా వెళ్లిపోయిందని మంత్రికి తెలియజేశారు. తక్షణమే గంజాయిని అరికట్టేలా జిల్లా పోలీసు యంత్రాంగానికి తగు సూచనలు ఇవ్వాలని కోరారు. హోంమంత్రిని కలిసిన వారిలో డాక్టర్ డీకేడీ.ప్రసాద్, కొండపల్లి రవి, తాళ్ళూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జేసీటీవో కార్యాలయం వద్ద వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నినాదాలు


చలో కలెక్టరేట్ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

బదిలీలు నిలిపివేయండి

వాణిజ్య శాఖ ఉద్యోగుల నిరసన

ఏలూరు అర్బన్, ఆగస్టు 28: వైసీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఉద్యోగుల బదిలీలను వెనక్కి తీసుకున్న తర్వాతే సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన బుధవారం రెండోరోజు కొనసాగింది. ఏలూరులోని జేసీటీవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. నోడల్ పరిధిలోని జిల్లాల్లో పనిచేస్తున్న సుమారు 480 మంది ఉద్యోగులను నిబంధనలను అతిక్రమించి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాంతీయ కార్యాలయాలకు బలవంతంగా బదిలీ చేసిందని, ఇపుడు కూటమి ప్రభుత్వం సాధారణ బదిలీలను చేపట్టడంతో ఇంతకుముందు బలవంతంగా నెట్టివేయబడిన ఉద్యోగులకు అన్యాయం జరిగే పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ వాణిజ్యపన్నుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషుకుమార్ వివరించారు. ఆర్డర్ టూ సర్వ్ పేరుతో జరిపిన బదిలీలన్నింటినీ రద్దుచేసిన తర్వాతే తమ శాఖలో సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పోస్టింగ్‌లపై న్యాయంకోసం హైకోర్టుని ఆశ్రయించనున్నట్టు వెల్లడించారు. న్యాయస్థానం ఆదేశాలు వచ్చేవరకు లేదా ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు సమన్యాయంచేసేవరకు బదిలీలను వాయిదావేయాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 28: సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ పీవోడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. కోయ కన్నాపురంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.లత, పీవైఎల్ డివిజన్ కార్యదర్శి గురుగుంట్ల ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా తల్లికి వందనం పథకం అమలు ప్రస్తావన లేదన్నారు. పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు ఫీజులు కట్టలేక బడులు మాన్పించి పనులకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు అదుపు చేయాలన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 28: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భజంత్రి శ్రీనివాస్ కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. నూతనంగా వచ్చిన కమిషనర్ పుష్పగుచ్ఛం అందజేసిన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు 6, 12, 18, 24 సంవత్సరాల ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. మెడికల్ బిల్లులు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు, ఆప్కాస్ కార్మికులకు హెల్త్ బకాయి చెల్లించాలన్నారు. వై.దుర్గారావు, శివకుమార్, కే.నాగేంద్ర, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వ ధర్మాలను గౌరవిస్తే ప్రపంచ శాంతి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 28: సర్వ ధర్మాల అవతార పురుషులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే ప్రపంచంలో శాంతి నెలకొల్పవచ్చని నూరూల్ ఇస్లాం శాఖ డైరెక్టర్ కే.తారిఖ్ అహ్మద్ అన్నారు. ఎన్ఆర్‌పేట లేడీస్ క్లబ్‌లో సమావేశం జరిగింది. యుద్ధాలకు ముగింపు పలికి రక్తపాతాన్ని ఆపి సమానత్వం న్యాయం, మతసామరస్యంతో కూడిన సమాజం కొరకు నూరుల్ ఇస్లాం శాఖ పని చేస్తుందన్నారు. అందర్నీ ప్రేమించు, ఎవరినీ ద్వేషించకు అనే నినాదంతో మానవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రపంచంలో శాంతి నెలకొల్పడానికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ఎంఏ.జాఫర్‌ఖాన్, యువజన అధ్యక్షులు ఎం.అహ్మద్‌మస్తాన్, వీఆర్వో మహ్మద్ జావేద్, రిజ్వాన్ సలీం పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేర్స్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, ఆగస్టు 28: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సత్రంపాడులోని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సెల్‌ఫోన్ రిపేర్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజులు ఉంటుందని, శిక్షణ కాలంలో వసతి, భోజనం ఉచితమన్నారు. 10వ తరగతి ఆపైన అర్హత గల 19-45 ఏళ్ల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 9502723561, 9014040780 నెంబరులో సంప్రదించాలన్నారు.

అమ్మవారి ఆలయ రహదారికి మరమ్మతులు

బుట్టాయగూడెం, ఆగస్టు 28: గుబ్బల మంగమ్మ ఆలయ రహదారిని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మరమ్మతు చేశారు. ఇటీవల భారీ వర్షాలకు కామవరం నుంచి గుడి వరకు రహదారి దెబ్బతింది. గోతుల్లో రాళ్ళువేసి మట్టితో పూడ్చి బాగుచేశారు. వర్షాలు పూర్తిగా తగ్గాక రోడ్డుకు మరమ్మతులు చేస్తామన్నారు. అమ్మవారి ఆలయం వరకు బీటీ రోడ్డు మంజూరైనట్లు ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారన్నారు. టూరిజం ఫండ్స్ ద్వారా 4200 మీటర్ల రోడ్డును వేయడం జరుగుతుందని అధికారులు వివరించినట్లు కమిటీ వారు తెలిపారు.

రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఇసుక లారీల తనిఖీ


చెక్‌పోస్టు వద్ద ఇసుక లారీలు

జీలుగుమిల్లి, ఆగస్టు 28: ఇసుక అక్రమ రవాణా నివారించేందుకు చర్యలు చేపట్టారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో మద్యం అక్రమ రవాణా తనిఖీలకు మాత్రమే పరిమితమైన చెక్‌పోస్టులను అప్రమత్తం చేసింది. కుక్కునూరు ప్రాంతం నుంచి వచ్చే ఇసుక రవాణా వాహనాలు ఆంధ్ర ప్రాంతంలో గమ్యస్థానం చేరే ప్రాంతం వివరాలు నమోదు చేస్తున్నారు. రాష్ట్ర శివారు తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం సమయానికి 52 టిప్పర్ లారీలు ఇసుక రవాణా అయినట్లు తెలిపారు. ఆయా వాహనాలకు సంబంధించి అనుమతులు పరిశీలించి రికార్డులో నామోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌బాబు చెప్పారు.

వేధింపుల భర్తపై కేసు


టి.నరసాపురం, ఆగస్టు 28: భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వి.జయకుమార్ బుధవారం తెలిపారు. టి.నరసాపురం గ్రామానికి చెందిన మురాల నక్షత్రం, సుజయ్‌కు 23 ఏళ్ళ క్రితం వివాహమైంది. వారికి కుమార్తె ఉంది. కొంతకాలంగా భార్య నక్షత్రంను భర్త సుజయ్ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో మూడేళ్ల క్రితం ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. అక్కడికి కూడా వెళ్ళి వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేస్తినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యం

ఏలూరు క్రైం, ఆగస్టు 28: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదని త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. శనివారపేట కుమ్మరవారి వీధికి చెందిన ఒక యువతి (22) ఇంటి వద్దే ఉంటుంది. ఈనెల 27వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమెకోసం వెతికినప్పటికి ఆచూకీ కానరాలేదు. దీంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సత్రంపాడు దుకాణంలో చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 28 : సత్రంపాడులోని డ్రైఫ్రూట్స్ షాపులో చోరీ జరిగింది. జీడిపప్పు, బాదంపప్పు, ఇతర డ్రై ఫ్రూట్స్ మొత్తం 25 కేజీలు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. ఈసంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.


ఏలూరు రూరల్, కొయ్యలగూడెం మండలంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది, పోలవరంలో పొలంబడి

ఈ-పంట నమోదు కీలకం.. 15 వరకు గడువు

ఏలూరు రూరల్, ఆగస్టు 28: వ్యవసాయ సాగులో ఈ-పంట నమోదు కీలకం. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనపుడు ఆదుకోడానికి, పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి ఈ- పంట సమాచారం తప్పనిసరి. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతులు సాగు చేసిన పంటల సమాచారాన్ని నమోదు చేయడానికి సెప్టెంబర్ 15 వరకు గడువు ఉంది. ఏలూరు రూరల్ మండలంలో 6వేల ఎకరాలకు 4వేల ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశారు. గడువు మీరితే యాప్‌లో సమాచారం స్వీకరించక సాగుదారులు నష్టపోయే ప్రమాదం ఉంది. కౌలురైతులు పంటసాగు హక్కు పత్రాలు వీఆర్వో నుంచి తీసుకోవాల్సి ఉంది. ఖరీఫ్‌సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ-పంట నమోదు తప్పనిసరి అని ఏడీఏ శైలజ సూచించారు. బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర తదితర ప్రభుత్వ పథకాలు పొందడానికి ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు.

- కొయ్యలగూడెం: ప్రతీ రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కె.చెల్లన్నదొర, వ్యవసాయ శాఖాధికారి చెన్నకేశవులు కోరారు. మండలంలోని రాజవరంలో వరిపొలాలు పరిశీలించారు. ఈ-పంట నమోదుతో ఎవరు ఏ పంట పండిస్తున్నారో తెలుస్తుందన్నారు. ప్రతీ రైతు వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు పంటుల వేసుకోవాలని దానికి అనుగుణంగానే ఎరువులు వాడాలన్నారు.

పోలవరంలో పొలంబడి

- పోలవరం: గ్రామంలో ఏవో కె.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ప్రతి బుధవారం క్షేత్రస్థాయిలో 14 వారాలు పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన పంట, ఎరువుల వినియోగం తగ్గించడం, రైతులకు నికర ఆదాయం కల్పించడం పొలంబడి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు, సుడిదోమ నివారణకు జిగురు అట్టల ఏర్పాటు అంశాలు, 25 నుండి 50 శాతం ఆకుల కత్తిరింపు 10 నుండి 20 శాతం పిలకల తొలగింపు తెలియజేశారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఆగస్టు 28: కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం డిగ్రీ కళాశాలలో అంతర్గత సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. మండల పరిషత్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల అలకనంద, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పాతూరి విజయకుమార్, పంది రాంబాబు, ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు, బొమ్మిడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో మెరుగైన సేవలందించాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 28: ఏరియా ఆసుపత్రిలో రోగులకు, జ్వర పీడితులకు మెరుగైన వైద్య సేవలందించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. కూటమి నాయకులు బుధవారం ఏరియా ఆసుపత్రిలో రోగులను పరామర్శించారు. వైరల్ జ్వరాలతో బాధపడుతున్న పలువురు పేషెంట్ల దగ్గరకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆర్ఎంఓ రాంబాబు, నాయకులు పెనుమర్తి రామకుమార్, తూటిగుంట రాము, కొప్పాక శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, పగడం సౌభాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు మత మార్పిడి తగదు

పోలవరం ఆగస్టు 28: బలవంతపు మత మార్పిడిని వ్యతిరేకిస్తూ ప్రభుత్వం నిర్ణయం హర్షణీయమని పోలవరం కూటమి నాయకులు అన్నారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి మాట్లాడుతూ బలవంతపు మత మార్పిడిని అరికట్టి దేవాలయాలను కాపాడే విధంగా తీసుకున్న నిర్ణయం సముచితం అన్నారు. నాళం గాంధీ, కరిబండి నాగరాజు, కామిశెట్టి నాగరాజు, కొణతాల ప్రసాద్, తెలగంశెట్టి రాము, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయం హర్షణీయం

టి.నరసాపురం, ఆగస్టు 28: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయాలు హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్న క్యాంటీన్ ఏర్పాటు, ఆలయ అర్చకుల వేతన పెంపు, ఆలయ ధూపదీప నైవేద్యాలకు రూ. పది వేలు, నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం పెంపు అభినందనీయమన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకున్న రోజును అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలువురు ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఏర్పాట్లు

ద్వారకాతిరుమల, ఆగస్టు 28: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రత ఏర్పాట్లు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అనివేటి మండప ప్రాంతంలో ఈ వేడుకలు జరిపేందుకు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా అరటిబోదెలు, మామిడితోరణాలుతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. సామూహిక వ్రతాలకు అధిక సంఖ్యలో ముత్తైదువులు హాజరుకావచ్చని ఆధికారులు అంచనా వేస్తున్నారు.

నవ్యాంధ్ర యాదవ సంఘం అధ్యక్షుడికి సత్కారం

దెందులూరు, ఆగస్టు 28: విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, సేవ కార్యక్రమాలు చేపడుతున్న నవ్యాంధ్ర యాదవ సంఘం అధ్యక్షుడు నెరుసు వెంకట సుబ్బయ్య యాదవ్‌ను పలువురు ప్రముఖులు బుధవారం సత్కరించారు. టీడీపీ నాయకులు నున్న లక్ష్మణ్ యాదవ్, ఆర్‌సీఎం పీఠం ఫాదర్ డాక్టర్ పి.బాల ప్రత్యేక ప్రార్థనలు చేసి సన్మానించారు. ఉప సర్పంచ్, అబ్రహాం, కసుకుర్తి రామకృష్ణ, కొవ్వలి శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ, యాదవ్ సంఘం నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు

వేలేరుపాడు, ఆగస్టు 28: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, బీఎల్వోలు ఇంటింటి సర్వే చేయాలని తహసీల్దార్ డీవీ.సత్యనారాయణ సూచించారు. బీఎల్వోలు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా వి.కోటేశ్వరరావు ఉద్యోగ బాధ్యతలు బుధవారం చేపట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.
- ఏలూరు రూరల్ ఎస్ఐగా సీహెచ్.దుర్గా ప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయనను ఏలూరు రూరల్ ఎస్ఐగా నియమించారు.
- జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వైఎస్‌వి ప్రసాద్ అనారోగ్యంతో ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రసాద్ ఇంటికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించడానికి సహాయ సహకారాలు అందిస్తానని, పోలీస్ యూనిట్ వైద్యులు, వైద్య సేవలు అందిస్తారని వారి కుటుంబానికి హామీ ఇచ్చారు.
- **ఏలూరు అర్బన్ :** సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో గురువారం స్థానిక ఆశ్రం వైద్యకళాశాల సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సాధారణ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల వ్యాధులు, దంతవైద్యం, పోషకాహార నిపుణులు మొత్తం 22మంది వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేశారు.
- **పెదపాడు :** మండల పరిధిలో 33/11 కేవీ, కలపర్రు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం 30న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లుగా ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు తెలిపారు.
- **దెందులూరు :** ధాన్యం కొనుగోలులో మెరుగైన విధానం తీసుకురావాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉండ్రాజవరంలో సున్నాపు వెంకట్రావు, గండి రాజా ఆధ్వర్యంలో కౌలు రైతు సంఘం సమావేశం నిర్వహించారు.
- **కామవరపుకోట :** బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పీవీ. రామలక్ష్మి ప్రారంభించారు. పార్టీలో చేరేందుకు అన్నివర్గాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. బీజేపీ సీనియర్ నాయకులు కాకి సురేష్‌కుమార్, ఒంటెద్దు ఏసువరప్రసాద్, చవటపల్లి సుబ్బారావు, జెర్రిపోతుల లక్ష్మీపతి, నందూరి భాను, చెలికాని భాస్కరరావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, ములకాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు చేస్తున్న కూటమి నాయకులు

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, ఆగస్టు 28 : అధ్వానంగా ఉన్న సంతోషపురం - పెదలంక ప్రధాన రహదారికి కూటమి నాయకులు, రైతులు బుధవారం స్వచ్ఛందంగా మరమ్మతులు ప్రారంభించారు. రహదారిపై పడిన గోతులను ఎక్స్‌వేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా సంతోషపురం నుంచి పెదలంక వరకు 10 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మత్తులు చేస్తున్నామని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా రహదారి మరమ్మత్తులు చేపట్టడంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, వేగిరెడ్డి చిన్నారావు, డీసీ మాజీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా డెక్క తొలగింపు



కలిదిండి, ఆగస్టు 28 : మండలంలో సీటీ కెనాల్‌కు ఇరిగేషన్ అధికారులు తాగునీటిని విడుదల చేశారు. నీటి ఎద్దడితో ప్రజలు అవస్థలు పడుతుండటంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి నీరు విడుదల చేయించారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, డీసీ మాజీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు తెలిపారు. సంతోషపురం వంతెన సమీపంలో గుర్రపు డెక్క పేరుకుపోయి పెదలంక కాల్వకు నీటి సరఫరా కాకపోవటంతో మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, వేగిరెడ్డి చిన్నారావు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా డెక్క తొలగింపు పనులను చేపట్టారు. ప్రస్తుతం లంక గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందని కాల్వ వెంబడి పశువులు, రొయ్యల వ్యర్థాలను తొలగించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంత్యక్రియలకు వైష్ణవి ఆర్థిక సాయం

ముదినేపల్లి, ఆగస్టు 28: ముదినేపల్లి మండలం సంకర్షణపురంలో బుధవారం అనారోగ్యంతో మరణించిన రేమల్లి డేవిడ్ రాజు (80) అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి వైష్ణవి తరఫున ఆమె తండ్రి మనోజ్ రూ.5 వేలు సహాయం అందజేశారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



ముదినేపల్లి, ఆగస్టు 28 : అల్లూరులో నిర్మించిన శ్రీ కృష్ణ మందిరం లో విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. ఆలయంలో విఘ్నేశ్వరుడు, శ్రీకృష్ణుడు, సత్యనారాయణ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. యాగశాలలో హోమాలు, మహా పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, పండిత సత్కారం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు శీలం వెంకటేశ్వరరావు, బోయిన హరికృష్ణ, సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ రెడ్డి సతీష్ బాబు, సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గుల్లిపల్లి సుధారాణి తదితరులు పూజలు జరిపారు. యాజ్ఞికుడు సోమరాజుపల్లి ఈశ్వర నాగకుమార శర్మ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించారు.

అన్నీ ఉన్నా ఆదరణ ఏదీ ?

500 ఎకరాలు ఉన్నా ఆదాయం సున్నా
జమిందారుల ఏలుబడిలో అభివృద్ధికి దూరం
ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయ దుస్థితి



శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయం

నూజివీడు, ఆగస్టు 28: దిక్కులేని వారికి దేవుడే దిక్కు అంటారు. శోభనాచలవ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి పేరుకు సంపన్నుడే.. కాని అనాథ. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో ఈ క్షేత్రం దక్షిణసింహాచలంగా ప్రసిద్ధి చెందింది. సరైన ప్రచారం లేక నిర్వహణ లోపాలతో అభివృద్ధికి నోచుకోక కునారిల్లుతోంది. ఈ దేవాలయానికి నాడు జమిందారులు 500 ఎకరాలకు పైగా భూమిని నిత్య దూపదీప నైవేద్యాల కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ భూమి రైతులపరం అయింది. ఈ భూమి నుంచి ఒక్కరూపాయి కూడా ఇప్పటికి ఈ దేవాలయానికి ఆదాయంగా రావడం లేదు. స్వామి వెలసిన ఈ కొండ అంతా ఈ దేవాలయానికి చెందినదే. దిగువ ప్రాంతం చుట్టూ కొండను 500 కుటుంబాలు ఆక్రమించి భవనాలు సైతం నిర్మించుకున్నారు. వీటి నుంచి అద్దెరూపేణా ఒక్క పైసా కూడా దేవాలయానికి అందడం లేదు.

నవ నారసింహావతారాల్లో ఒకటి

నాలుగు వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన శివకేశవులు కొలువు తీరిన పుణ్యక్షేత్రం ఇది. నరనవ నారసింహావతారాల్లో ఒక అవతారం వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి అవతారం.ఇక్కడ స్వామికొండపై స్వయంభూగా వెలిశారు. శుభవ్రతుడు అనే చంద్రవంశపు రాజు నరసింహుడు గురించి కొండపై తీవ్ర తపస్సు ఆచరించి స్వామి అనుగ్రహం పొంది ఈ కొండపై అమ్మవారితో కలిసి వెలవాలని కోరిన కోరిక మేరకు స్వామి ఇక్కడ స్వయంభూగా వెలిసినట్లు కథనం. మరో కథనం ప్రకారం శివకేశవులు లోక సంచారం చేస్తూ ప్రకృతి శోభతో విరాజిల్లుతున్న ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ముగ్ధులై ఇక్కడ కొండ అగ్రభాగాన శివుడు, కొండ మధ్య భాగాన లక్ష్మీనరసింహ అవతారంతో విష్ణువు వెలసినట్లు ప్రచారం. కాలానుగుణంగా ఈ దేవాలయం నూజివీడు జమిందారులైన మేకా వంశస్థులు వంశ పారంపర్య ధర్మకర్తలుగా ఉన్నారు. ఈ క్షేత్రం అగ్రభాగానికి వెళ్లేందుకు 750 మెట్లు ఎక్కాలి. 150వ మెట్టు వద్ద శేషయ్యపీఠం, కోదండ రామాలయం, 200వ మెట్టు వద్ద వేణుగోపాలస్వామి ఆలయం, 325 మెట్టు వద్ద వెంకటాచలస్వామి ఆలయం, 500 మెట్టు వద్ద శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ ఆలయాలు ఉన్నాయి. అగ్రభాగాన శివుడు, కొండ మల్లేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. శ్రీమహావిష్ణువు ఇక్కడ వరాహరూపంలో వరాహ పుష్కరిణిని సృష్టించారని ప్రతీతి. కొండ దిగువున ఈ పుష్కరిణి ఇప్పటికీ ఉంది.

హామీలు నీటిమూటలే

ఈ దేవాలయానికి వంశపారంపర్య ధర్మకర్త అయిన నూజివీడు మాజీ శాసనసభ్యుడు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా నూజివీడు నుంచి గెలిచారు. ప్రతి ఏటా జరిగే రథోత్సవంలో ఆయన ఈ గుడి అభివృద్ధికి హామీలు ఇచ్చేవారు. కాని అవేమీ కార్యరూపం దాల్చలేదు. ఆగిరిపల్లి కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేయిస్తానని అనేక పర్యాయాలు ధర్మకర్తగా, శాసనసభ్యుడిగా పలుమార్లు హామీలు ఇచ్చినా అవి అమలు కాలేదు. నూజివీడు మాజీ శాసనసభ్యుడు చిన్నం రామకోటయ్య ఘాట్ రోడ్డు నిర్మాణం చేయటానికి ప్రయత్నాలు చేయగా ఆలయ ధర్మకర్తలు మేమే అభివృద్ధి చేసుకుంటామని చెప్పడంతో ఆగిపోయింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పథకం రూపొందించింది. ఈ క్షేత్రానికి దగ్గరలో వెయ్యి ఎకరాలు విస్తీర్ణంలో బ్రహ్మలింగయ్య చెరువు ఉంది. ఈ చెరువు ఇటు నూజివీడు, అటు గన్నవరం నియోజకవర్గాలను కలుపుతూ ఉంటుంది. ఈ చెరువులో బోటింగ్, పర్యాటక కేంద్రంగా రూపొందించటానికి నాడు అంచనాలు రూపొందించారు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్షేత్రానికి ఘాట్‌రోడ్డు వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభిస్తే దాతలు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. 750 మెట్లు ఎక్కడానికి కష్టమైన భక్తుల కోసం కొండ దిగువున శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ప్రతిష్ఠ ఆలయాన్ని నిర్మించారు.

భక్తుల విశ్వాసానికి విఘాతం



ఉత్సవ విగ్రహం చోరీతో భక్తుల విస్మయం

ఆగిరిపల్లి, ఆగస్టు 28: చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహ చోరీ భక్తుల విశ్వాసానికి విఘాతం కలిగించినట్లు అయింది. స్వయంభువుగా వెలసిన ఎగువ సన్నిధి స్వామి వద్ద నైవేద్యం పెట్టి ఘంట కొడితేనే దిగువ సన్నిధిలోని స్వామివారికి నైవేద్యం పెడతారు. ఈ రెండు నివేదనల మధ్యకాలంలో చోరీ జరగటం, అది పట్టపగలు జరగటం భద్రతా లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఈ ఆలయ పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని దేవస్థానం కార్యదర్శి పోలీస్‌శాఖకు పలుమార్లు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాల వైర్లు, విద్యుత్ వైర్లుపూర్తిగా కత్తిరించి ఈ దొంగతనం చేసినట్లుగా తెలిసింది. పోలీసులను వివరణ అడగ్గా బుధవారం సాయంత్రం క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలు సేకరించిందని వివరాల్లో తెలియాల్సి ఉంద న్నారు. ఈ చోరీపై రెండుటీమ్‌లు విచారణ చేస్తున్నాయని ఏఎస్సై తవేరియా నాయక్ తెలిపారు.

క్షమించరానిది : మాదల శివరామ్‌ప్రసాద్, గ్రామస్థుడు



ఎండోమెంట్ నిర్వహణలో ఉన్న ఆలయంలో ఉత్సవ విగ్రహం చోరీ. క్షమించరాని విషయం. గంజాయికి అలవాటు పడిన ఆకతాయిలు ఇలాంటి నేరాలు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిపెట్టాలి: కృష్ణకుమార్, గ్రామస్థుడు



దేవాలయాల భద్రత పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలి గత ప్రభుత్వం దేవాలయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దేవాలయాల పరిరక్షణపై చర్యలు చేపట్టాలి.



పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు.. పులిహోరలో కనిపించిన పురుగు

పులిహోర ప్రసాదంలో పురుగు కలకలం

ద్వారకాతిరుమల, ఆగస్టు 28: ఏలూరుకు చెందిన బలభద్ర రామయ్య తన భార్యతో కలసి మంగళవారం సాయంత్రం శ్రీవారి దర్శనానికి ద్వారకాతిరుమల వచ్చారు. దర్శనం అనంతరం ప్రసాదాల కౌంటర్‌లో లడ్డూ, పులిహోర, శర్కర పొంగలి కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన తరువాత పులిహోర తినేందుకు ప్యాకెట్ విప్పగా అందులో పురుగు కన్పించడంతో ఆందోళన చెందారు. ఈ విషయాన్ని ఆయన ఏలూరుకు చెందిన తన స్నేహితుడైన టీడీపీ రాష్ట్ర ట్రేడ్ వింగ్ ఉపాధ్యక్షుడు పైడేటి రఘుకు తెలియపర్చగా ఆయన వాట్సప్ ద్వారా ఈవో వేండ్ర త్రినాథరావుకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే బుధవారం ఉదయం ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు.

ప్రసాదాల రవాణాలో పడి ఉండొచ్చు

ఈ ఘటనపై ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ ఏలూరు భక్తులు కొనుగోలు చేసిన ప్రసాదంలో పురుగు వచ్చినట్లు తనకు సమాచారం వచ్చిందని వెంటనే ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశామన్నారు. భక్తులకు విక్రయించే ప్రసాదాలను ట్రక్కు ఆటో ద్వారా కౌంటర్లకు తరలిస్తారని రవాణా చేసే సమయంలోనే చెట్లపై నుంచి ఈ పురుగు పడి ఉండవచ్చని వివరించారు. ముందుగా కాంట్రాక్టరుకు నోటీసు ఇచ్చామని అలాగే ఏఈవో, సూపరింటెండెంట్, ఇతర సిబ్బందిపై చర్యలకు ప్రతిపాదిస్తామన్నారు.



హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఆర్డీవో

అట్రాసిటీ కేసులు వేగంగా పరిష్కరించాలి : ఆర్డీవో

నూజివీడు టౌన్, ఆగస్టు 28: అట్రాసిటీ కేసులు వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి సూచించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలోను అట్రాసిటీ చట్టాలపై పేరెంట్ కమిటీలకు అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో నమోదైన 13 కేసులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు పట్టణంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధుల దుర్వినియోగం, రహదారులు ఆక్రమణపై కమిటీ సభ్యుడు నత్తా నాగేశ్వరరావు కమిటీ దృష్టికి తెచ్చారు. ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం జరగాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 28: తిరువూరు మండలం పెద్దవరం గ్రామంలో యువరాజ్ అలియాస్ డేవిడ్‌పై అగ్రకులాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నూజివీడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఆగిరిపల్లి మండల అధికార ప్రతినిధి నల్లమోతు కాంచనరావు తెలిపారు. కేసు విచారణ చేసినా అరెస్ట్ చూపకుండా రిమాండ్‌కు పంపకుండా తాత్సారం చేస్తున్నారంటే ఇందులో కుట్రకోణం దాగి ఉందని భావిస్తున్నట్టు తెలిపారు. దోషులను అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తుందన్నారు.

లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం

నూజివీడు టౌన్, ఆగస్టు 28: గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు స్థలా న్ని కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి, నూజివీడు నియోజకవర్గ గౌడ సంఘ నాయకులు మరీదు శివరామకృష్ణ వినతి పత్రాన్ని అందించారు.

చాట్రాయి ఎస్ఐగా రామకృష్ణ బాధ్యతల స్వీకారం



చాట్రాయి, ఆగస్టు 28: చాట్రాయి పోలీస్ స్టేషన్ ఎస్సైగా డి. రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూజివీడు టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న ఈయన సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న కేసీహెచ్ స్వామి పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, ఆగస్టు 28: మండలంలో సోమవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సోమవరం, మర్లపాలెం, కొత్తగూడెం, యర్రావారిగూడెం గ్రామాల్లో కొత్త లైన్లు నిర్మాణం నిమిత్తం గురువారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సంజయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత

చాట్రాయి, ఆగస్టు 28: మంత్రి పార్థసారథి ఆదేశాల మేరకు చాట్రాయి పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామంలో డెయిన్లు పూడుకుపోయి వర్షం నీరు, మురుగునీరు నివాస ప్రాంతాల్లో నిలిచి దోమలు పెరిగి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని ఇటీవల స్థానిక టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. డ్రెయిన్ల పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ జ్వరాలను అరికట్టేందుకు వైద్యశిబిరాలు

ముసునూరు, ఆగస్టు 28: సీజనల్ జ్వరాలను అరికట్టేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి అన్నారు. బుధవారం గోపవరం, ముసునూరు బీసీ కాలనీలో వైద్య శిబిరాలను నిర్వహించి 108 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అరుగురు జ్వర పీడితులు ఉన్నట్టు గుర్తించి, వారికి టైఫాయిడ్, మలేరియా, డెంగీ పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చినట్లు హెల్త్ సూపర్‌వైజర్ మురళీమోహన్ తెలిపారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వైద్యాధికారిణి ఇవాంజలి కోరారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మి

విద్యార్థులకు భద్రత కల్పించాలి

కైకలూరు ఆగస్టు 28: విద్యార్థులు సామాజిక స్పృహను కూడా పెంచుకోవాలని కైకలూరు సీనియర్ న్యాయాధికారిణి వీవీఎన్‌వి లక్ష్మి అన్నారు. బుధవారం కైకలూరు జాగృతి స్కూల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు వద్ద పిల్లలు ఎంత భద్రతగా ఉంటారో పాఠశాలలో కూడా అదేవిధంగా భద్రత కల్పించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడడం నేరమని ఎవరైనా పిర్యాదు చేస్తే చట్టరీత్యా వారిపై కేసులు నమోదు చేస్తారన్నారు. అలాగే విద్యార్థి దశలోనే చట్టాలు, హక్కుల పట్ల అవగాహన కల్గియుండాలని సూచించారు. న్యాయవాదులు పి. పవన్‌కాంత్, జయప్రకాష్, ప్రిన్సిపాల్ పానెం జయకిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ సర్వే వేగవంతం చేయాలి

ముదినేపల్లి, ఆగస్టు 28 : పల్స్ సర్వేను ముదినేపల్లి మండలంలో వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.మల్లీశ్వరి తెలిపారు. బుధవారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద అన్ని గ్రామాల్లోని ఇంటింటికీ కుళాయిల కనెక్షన్లు ఉన్నాయా? లేదా త్వరితగతిన సర్వే చేయాలని తెలిపారు. 30న వన మహోత్సవంలో సామాజిక స్థలాలు, ప్రభుత్వ సంస్థల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రక్షిత నీటి సరఫరా పథకాలను పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు.



హెచ్‌ఎం పద్మావతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

హెచ్‌ఎంకు పదవీ విరమణ సత్కారం

ముదినేపల్లి, ఆగస్టు 28 : మండలంలోని పెదపాలపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదవీ విరమణ చేస్తున్న పద్మావతిని పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. యుటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు జి.రమేష్, వల్లూరు సత్యనారాయణ, బేతాళ రాజేంద్ర ప్రసాద్, రెడ్డి శ్రీనివాసరావు, ఐ.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయినులు జయలక్ష్మి, విజయ కుమారి, సీఆర్పీలు ఆంజనేయులు, విజయ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



మండవల్లి ఆగస్టు 28 : మండవల్లి హైస్కూల్ 1989-90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు హైస్కూల్లో రికార్డులు భద్రపరిచేందుకు బీరువాను బహూకరించారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌కు ఐరన్ బీరువాను అందజేశారు. విద్యాకమిటీ మాజీ చైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు, పూర్వ విద్యార్థులు బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కొండంగిలో యువకుడి అదృశ్యం

కువైట్ పంపుతానని సొమ్ము తీసుకున్న వ్యక్తి నిర్లక్ష్యం
ఒత్తిడికి గురై ఇంట్లోంచి వెళ్లిపోయాడన్న తల్లి
మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



నున్న మోజేష్ (ఫైల్)

కలిదిండి, ఆగస్టు 28 : మండలంలోని కొండంగి గ్రామానికి చెందిన నున్న మోజేష్ (32) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని తండ్రి ఏసురత్నం ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మోజేష్ అదృశ్యమవ్వటానికి పాలకొల్లుకు చెందిన గల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి కారణమని తల్లి మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కువైట్ పంపిస్తానని మోజేష్‌తో సహా మరో 11 మంది నుంచి మోజేష్ ద్వారా రూ. 9 లక్షలు గల్లి శ్రీనివాసరావు వసూలు చేశాడని, నెలలు గడుస్తున్నా కువైట్‌కు పంపించకపోవటంతో బాధితులకు అనుమానం వచ్చి శ్రీనివాసరావుకి ఫోను చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవటం లేదని తెలిపింది. దీంతో 11 మంది బాధితులు మోజేష్‌ని నిలదీయడంతో ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడని, తన కుమారుడిని మోసం చేసిన గల్లి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని తల్లి మరియమ్మ కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విచ్చలవిడిగా రోడ్లపైకి..

రహదారులపైనే గోమాతల సంచారం..
పట్టించుకోని పెంపకందారులు, అధికారులు
రాత్రిపూట ప్రమాదాలకు కారణమవుతున్న పశువులు
ప్రమాదాల నివారణకు నడుం బిగించిన మానవత



కైకలూరు రైతుబజారు వద్ద జాతీయ రహదారిపై ఆవుల తిష్ఠ



కోరుకొల్లు రోడ్డులో చెత్తకుండీల్లో చెత్తను తింటున్న ఆవులు



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లేగదూడ



మానవత ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డు

కైకలూరు పట్టణంలో ఒక వైపు ఇరుకు రహదారులతో ప్రయాణికులు సతమతమవుతుంటే మరోవైపు ఆవులు విచ్చలవిడిగా రహదారులపై సంచరించడంతో ప్రజల బాధలు వర్ణనాతీతం. సుమారు 400 పైగా ఆవులు కైకలూరు పట్టణంలో సంచరిస్తున్నాయి. జాతీయ రహదారి పై అడ్డుగా ఉండడమే కాక చెత్తకుండీల వద్ద గుంపుగా నిలబడి ఒకదానికొకటి పొడుచుకుని ప్రజల మీదికి దూసుకువస్తున్నాయి.

కైకలూరు ఆగస్టు 28: రాత్రి సమయాల్లో రహదారిపై ఉన్న ఆవులను గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడిన ఆవులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఇటీవల కాలంలో 3 లేగ దూడలను వాహనాలు ఢీకొనడంతో ఎముకలు విరిగి రహదారి పక్కన పడి ఉన్నాయి. గతంలో రహదారులపై ఆవుల నిర్మూలనకు పంచాయతీ నుంచి కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ పశువుల పెంపకందారుల్లో మార్పు రాకపోవడంతో మరలా రోడ్లపైకే చేరుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమో, సమన్వయ లోపమో తెలియదు కానీ మూగజీవాల వల్ల ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా మారాయి. కైకలూరు పట్టణంలో టౌన్ హాలు, రైతుబజారు, బస్టాండు, కోరుకొల్లురోడ్డులో, నిత్యం రహదారిపైనే ఆవులు సంచరిస్తున్నాయి. గుంపుగా ఆవులు ఉన్న చోట రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఏ సమయంలో ఒకదానితో ఒకటి పొడుచుకొని మీద పడతాయోనని ప్రయాణీకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇరుకు రోడ్లలో జనసంచారానికి చోటు లేకపోవడం దీనికి తోడు ఆవులు తిరగడంతో ప్రజలు ఎవరికి చెప్పాలో తెలియని స్థితిలో ఉన్నారు. అలాగే కైకలూరు-ఏలూరు ఆర్అండ్‌బీ రహదారిలో సైతం కొల్లేరు గ్రామాల నుంచి రైతులు తమ పశువులను కొల్లేరులో మేపేందుకు వదిలివేస్తున్నారు. అవి తిరిగి రాత్రి సమయాల్లో ఇళ్లకు చేరుకుంటున్నాయి. ఆ సమయంలో ప్రయాణించే వాహనదారులకు పశువులను కన్పించకపోవడంతో వాటిని ఢీకొని గాయాలపాలవుతున్నారు. ప్రస్తుతం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిపైన ఎలాంటి కేసులు నమోదు కాకపోవడంతో వెలుగులోనికి రావడం లేదు. కానీ పశువుల వలన గాయాలైన ప్రయాణీకులు దివ్యాంగులైన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించి పశువులను రహదారులపై సంచరించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మృత్యువాత...

ఆవులను రహదారులపై వదిలివేయడంతో తినేందుకు ఆహారం దొరకక చెత్తకుండీల్లో ఉండే క్యారీ బ్యాగులను సైతం ఆవులు తినేస్తున్నాయి. అయినప్పటికీ రైతులు స్పందించకపోవడంతో అవి అనారోగ్యానికి గురై రహదారులపైనే మృత్యువాత పడుతున్నాయి. ఆహారం కోసం చెత్తకుండీల వద్ద ఒకదాన్ని ఒకటి పొడుచుకొని అటుగా వెళుతున్న ప్రయాణీకులపైకి దూసుకువస్తున్నాయి. ఇటీవల మాగంటి థియేటర్ సమీపంలో రెండు ఆబోతులు ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటూ పక్కనే నిలిపివున్న ద్విచక్ర వాహనాలపై పడి ధ్వంసం చేశాయి. దీంతో సమీపంలో ఉన్న దుకాణదారులు దుకాణాలను మూసివేసి పరుగులు తీశారు.

గాయపడిన దూడలకు వైద్యం...

రహదారిపై వాహనాలు ఢీకొని గాయాలైన మూడు లేగదూడలకు పంచాయతీ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. ఒక లేగదూడకు కాలు ఎముక విరిగిపోవడంతో గన్నవరం పశువైద్యశాలకు తరలించి శస్త్రచికిత్స చేయించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికైనా రైతులు స్వచ్ఛందంగా తమ ఆవులను ఇళ్లకు తీసుకువెళ్లాలి. లేదంటే రైతులపై చర్యలు తీసుకుంటాం.

-డీఎం నవరత్నకుమారి, సర్పంచ్, కైకలూరు

బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం : మానవత

పశువులను ఢీకొని ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని కైకలూరు మానవత సేవా సంస్థ అధ్యక్షులు కొండ్రెడ్డి చిట్టెమ్మ, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. కొవ్వాడలంక నుంచి కైకలూరు వరకు సుమారు 10 చోట్ల బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. రెండు రోజుల్లో రహదా రులపై బోర్డులను ఏర్పాటు చేస్తామని సభ్యుడు శ్యాంకుమార్ తెలిపారు.